ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

మార్చి 16, 2008

Entered
18/3/08

కథా నిలయం
శ్రీకాకుళం



మండు వేసవే
పండు వెన్నెలగా...



హ్యాపీబర్త్‌డే

(2008 మార్చి-16 నుంచి
2008 మార్చి-22 వరకు)

వై. రశ్మిక
10సం॥, మార్చి-16
అనురాధ-శ్రీనివాసరావు
గోవిందాపురం-ఖమ్మం

చందనప్రియ
6సం॥, మార్చి-16
వరలక్ష్మి-రమణ
శ్రీరాంనగర్-కర్నూలు

జె. సాత్విక్
9సం॥, మార్చి-18
వందన-బాబురావు
జవహర్‌నగర్-హైదరాబాద్

టి. గౌతమ్
1సం॥, మార్చి-16
లక్ష్మీకుమారి-శ్రీనివాసరావు
మార్కాపురం-ప్రకాశం

వి. ప్రణవి
8సం॥, మార్చి-17
సునీత-వెంకటరామారావు
అశోక్‌నగర్-ఖమ్మం

ఎం. హిమవల్
10సం॥, మార్చి-20
నవత-హర్షవర్ధన్‌రెడ్డి
శ్రీనగర్-ఖమ్మం

కె. మానస
7సం॥, మార్చి-19
ఝాన్సీ-నాగేంద్ర
గోవిందాపురం-ఖమ్మం

బి. రాజా
6సం॥, మార్చి-22
పద్మజ-రాజ్‌గోపాల్‌రెడ్డి
వీడీవోస్‌కాలనీ-ఖమ్మం

జ్యోతిర్
4సం॥, మార్చి-17
అనురాధ-గంగాధర్
నెల్లూరు

ఎస్. పూజిత
8సం॥, మార్చి-21
అంజని-జగన్
పెదఅవుటపల్లి-కృష్ణా

యు. గీతాంజలి
7సం॥, మార్చి-21
వెంకమ్మ-లక్ష్మణస్వామి
కల్లూరుఎస్టేట్-కర్నూలు

యు. సంకేత
2సం॥, మార్చి-18
జ్యోతి-కృష్ణ
పెద్దముప్పారం-వరంగల్

సిహెచ్.వి.ఎస్ ధనుష్‌రెడ్డి
1సం॥, మార్చి-2007
సుగుణ-రామాంజులరెడ్డి
నాగులవరం-ప్రకాశం

మారం గాయత్రి
1సం॥, మార్చి-16
సుధారాణి-సుధాకర్
దుర్గాపురం-విజయవాడ

జ్ఞాన నాగశిరీష
2సం॥, మార్చి-2006
సుజాత-శ్రీనివాస్
ఆదుర్రు-తూ॥గో॥



కథా నిలయం
శ్రీకాకుళం

విద్యా ప్రమాణాలు పెరగాలి

మన అతిథి

పేరు	:	తక్కెళ్ళపల్లి తిరుపతిరావు
తల్లిదండ్రులు	:	ఆండాళ్లు, వెంకట్రాం నర్సింహారావు
జన్మ స్థలం	:	కొంకపాక గ్రామం, పర్వతగిరి మండలం, వరంగల్ జిల్లా.
పుట్టిన తేది	:	15 ఫిబ్రవరి, 1953
చదువు	:	ఎం.ఎ.,ఎంఫిల్, పిహెచ్ డి (పొలిటికల్ సైన్స్)
వృత్తి	:	ఉస్మానియా యూనివర్సిటీ 22వ ఉపకులపతి, ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు (2004 నుండి)
పరిశోధనలు	:	ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వ్యవస్థ సామాజిక, ఆర్థిక స్థితిగతులపై పరిశోధన, ఆహార భద్రత, నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ స్కీమ్ పై పరిశోధన
ఇష్టపడేది	:	సానుకూల దృక్పథం
ఇష్టపడనివి	:	వ్యక్తిత్వం, విలువలు లేకపోవడం
లక్ష్యం	:	ప్రభుత్వ విధానాలు... గ్రామీణాభివృద్ధిపై మరింత అధ్యయనం... పరిశోధన, విద్యారంగ అభివృద్ధి, ఉన్నత విద్యలో ప్రమాణాలు, పరిశోధనకు ప్రోత్సాహమివ్వడం.

సమాజంలో వసుధైక కుటుంబం అనే భావన కనుమరుగై పోతోంది. ఒకరి బాగోగులు ఒకరు చూసుకోవడం, అందరూ ప్రశాంతంగా జీవించడం నేడు కనుమరుగైపోయింది. సమాజంలో అట్టడుగున వున్న పేదవారిని అభివృద్ధి పథంలోకి తీసుకురావాలనే ఆలోచన నేడు చేయడం లేదు. ప్రతి ఒక్కరికీ తమ వ్యక్తిగత స్వార్థం పెరిగిపోయింది. ఈ పరిస్థితులు మారాలి. కుటుంబాలు కూడా విచ్ఛిన్నమౌతున్నాయి. పిల్లలు తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదు. వృద్ధాశ్రమాలు పెరుగుతున్నాయి. తల్లిదండ్రులను పట్టించుకొన్నవారికే ఆస్తిలో వాటా ఇవ్వాలని ప్రభుత్వం యోచించడం అభినందనీయం. విజ్ఞాన సమాజంలో విద్యే శక్తినిస్తుంది. నూరు శాతం అక్షరాస్యత వున్న దేశాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయి. చదువులో వెనకబడిన దేశాలు అభివృద్ధిలో సైతం వెనుకబడుతున్నాయి. విద్య అందరికీ అందుబాటులోకి రావడం లేదు. పాఠశాల విద్యా నిర్లక్ష్యానికి గురౌతున్నది. ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు మన దేశంలో 7 నుండి 10 శాతం మాత్రమే వున్నారు. ఈ శాతం 15 శాతానికి పెరగాలని ప్రభుత్వం కృషి చేస్తోంది. విద్యా ప్రమాణాలు పెరగాలి. మాతృభాషతో పాటు ఇంగ్లీష్ భాషపై పట్టు ఉండాలి. ఉద్యోగావకాశాలు బాగా పెరిగిపోయాయి. కాని ఉద్యోగాలకు కావలసిన అర్హతా మెళకువలు యువతలో పెరగాల్సి ఉంది. కంప్యూటర్‌లో ప్రవేశం, కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీషులో ప్రావీణ్యం కలిగి ఉండాలి.

T. Tirupathi Rao

ఈ సంచికలో....

టపా	...	2
విజ్ఞాన వీచిక...	...	3
నవ్వుల్... పువ్వుల్	...	4
చూద్దామా	...	5
సీరియల్	...	8
మనసా... తెలుసా	...	10
రుచి	...	11
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14

ఇంకా...

రంగు పదుద్ది ... 23

మంచిపుస్తకం ...6

విశ్వ మేధావి
విలువైన భావాలు



సలహాలు	...	17
లాహిరి లాహిరిలో	...	20
సమ్‌థింగ్ స్పెషల్	...	22
కొత్త పుస్తకాలు	...	24

కథ ... 18
నిరుద్యోగ పర్వంలో...



బడ్జెట్ ...బావుంది

మార్చి తొలి సంచిక అట్టమీది కథ కోటేశ్వర రావు గారి "బడ్జెట్ అంటే ఆల్జీబ్రానా" బావుంది. బడ్జెట్ జోక్స్‌తో పాటు బడ్జెట్ స్వరూప స్వభావాల ప్రాథమిక సమాచారం అందించారు. చక్కటి అవగాహన కలిగింది. 'ఆరోగ్యం'లో డాక్టర్ శంకర్ గారు, నోటి ఆరోగ్య ప్రాధాన్యతను తెలియజేశారు. 'నువ్వా! నేనా!! ఫీచర్‌లో, ఒంటెల పందేలు గమ్మత్తుగా అనిపిస్తే, ట్రిక్ ఫొటోల మాయాజాల విశేషాలు ఉత్సుకత కలిగింపజేశాయి. "విజ్ఞాన వీచిక"లో పేర్కొన్నట్టు.... మానవ జాతి సమిష్టి పిచ్చితనంపై, సమిష్టి విజ్ఞత పైచేయి సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 'సినిమా కబుర్లు'లో చెప్పినట్టు భూమి కన్నా, ఆకర్షణ శక్తి ఎక్కువ వున్నది సినిమారంగానికే అన్నది నిజమే. అయినా ఒకప్పటితో పోలిస్తే కారణాలు ఏమైనాగాని సినిమా రంగంపై మోజు కాస్త తగ్గిందని చెప్పక తప్పదు! "బాలనేస్తాలు"లో ఆరు మొహాలు కనిపించాయా? వంటి అంశాలు ఎంతో చక్కగా ఆకట్టు కుంటున్నాయి. విశాల దృక్పథంతో వసుదైక కుటుంబం అన్న మన ప్రాచీనుల స్ఫూర్తితో, శాస్త్రీయ అవగాహనతో మన సమాజాన్ని పునఃనిర్మించుకోవాల్సిన అవసరాన్ని ప్రస్తుతించిన, మన అతిథి, యతిరాజులు గారి మనోగతంతో మేమూ శృతి కలుపుతున్నాం.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం టౌన్.

ఈ వారం స్నేహలో అట్టమీది కథ 'బడ్జెట్ అంటే ఆల్జీబ్రానా'ను ఎం. కోటేశ్వరరావు గారు వివరించిన తీరు బాగున్నది. అయితే ఇప్పటివరకు బడ్జెట్ వల్ల మనకేం దక్కుతుందిలే అన్నట్టు దాని గురించి పట్టించుకోలేదు. మన దేశంలో మంత్రులు... రైతులను ఆదుకొనేందుకు ఈ బడ్జెట్ సరైన మార్గం. ఈ విషయాలు ప్రచురించిన కోటేశ్వరరావుగారికి కృతజ్ఞతలు

అనుపోజు సత్యనాగరాజు,
రాజీవ్‌నగర్ కాలనీ, విజయనగరం.

హృదయాన్ని తడిపిన 'లోపలి వర్షం'

"అట్టమీది కథ 'బడ్జెట్ అంటే ఆల్జీబ్రానా''ను గట్టి గానే వడ్డించారు. చాలా బావుంది. బడ్జెట్ జోక్స్ గమ్మత్తుగా ఉన్నాయి. 'నవ్వుల్- పువ్వుల్' సూపర్బ్. 'బాల నేస్తాలు'లో బాలలు పాల్గొనే విధంగా పోటీలు పెట్టి విజేతలకు బహుమతు లివ్వండి. 'లోపలి వర్షం' కథ వాస్తవానికి దగ్గరగా ఉంది. మా హృదయాల్ని తడిపేసింది. ఈ వారం ట్రిక్ ఫొటోలు ఎంతో ఆకర్షించాయి. మినీ వారపత్రిక చదువుతున్న అనుభూతి కలిగిస్తున్నారు.

బిక్కునూరు రాజేశ్వర్, పాన్కల్.

చిరస్మరణీయురాలు

ఒకప్పుడు సినిమాకు సంగీతం ముఖ్య భూమిక వహించేది. కుండ, డప్పు, ఫ్లూటు, సన్నాయి, హార్మోనియం వంటి వాయిద్యాలతో కూడిన సంగీతం... దర్శకుని ప్రతిభకు... గాయనీ గాయకుల గాత్రం తోడై టూరింగ్ టాకీసుల్లో ఇసుకనేలపై పరవళ్లతో వేసే గంతులు తలచుకుంటే ఏవేవో గుర్తొస్తాయి. నాటి సినిమాల విజయాల వెనక సమిష్టి కృషి కంటిముందు సాక్షాత్కరిస్తుంది. గాయనీమణులెందరున్నా విన సొంపైన పాటలతో మదిలో కలవరం రేపే జమునా రాణి గారు "చిర స్మరణీయురాలు". వెండితెరపై సిని మాలున్నంత కాలం ఆమె పాటలు రింగు రింగున మారుమ్రోగు తుంటాయి. ఆవిడ తమిళ, కన్నడ, మళయాళ, భాషలలో పాటలు పాడటంతో పాటు మలేషియా వంటి దేశాలలో ప్రోగ్రాం లిచ్చారన్న సంగతి డా॥ జెపి వైద్య గారు వివరించే వరకు చాలా మందికి తెలియదు.

యర్రమోతు ధర్మరాజు,
ధవళేశ్వరం, తూగో జిల్లా.

వేగుచుక్క వంటి పుస్తకం

"బడ్జెట్ అంటే ఆల్జీబ్రానా" కవర్ స్టోరీ బాగుంది. బడ్జెట్‌కు వుండే చారిత్రాత్మక పాధాన్యతను తెలియజేసింది. బడ్జెట్ జోక్స్ బాగున్నాయి. బడ్జెట్‌కు అర్థం ఆల్‌జీబ్రాయే. ఇప్పుడు బడ్జెట్‌లో ఆదాయ వనరుల వివరాలు, అప్పులకు చెల్లిస్తున్న వడ్డీ వివరాలు, విదేశీమారక ద్రవ్యం కొరకు కోల్పోతున్న జాతీయ ఆదాయం



మొదలగు వివరాలు పేర్కొనడం లేదు. అలాగే బడ్జెట్ తదుపరి పన్నులు, సుంకాలు, సర్‌ఛార్జీలు పెంచుతున్నారు. దీని వలన ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా మొయిద్దీన్ కవితా పుస్తకం గురించి చక్కగా పరిచయం చేశారు. సాహిత్య రంగంలో ఆ పుస్తకం వేగు చుక్క వంటిది.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

తమాషా బొమ్మలు బావున్నాయి

హిందీ టీచర్ ఎతి రాజులుగారు సమాజ వికాసానికి తోడ్పడాలనడం బాగుంది. విహార, విజ్ఞాన సాంస్కృతిక, దైవ సంబంధిత యాత్రలకు అనువైన రాష్ట్రం ఒరిస్సా గురించి చక్కగా ఇచ్చారు. ముగ్దుమ్ కవితలు ముద్దుగా ఉన్నాయి. పగటి బడ్జెట్ అయినా, రాత్రి బడ్జెట్ అయినా పేదవారి బ్రతుకు చీకటే. ముక్కు మీద లోపం జమునా రాణికే తగు. కాకర వేపుడు కమ్మగా వుంది. మూడవ రంగుల పేజీ (తమాషా బొమ్మల పేజీ) బావుంది.

వాస్తు రామచంద్ర, రాంజీనగర్,
నెల్లూరు.



ఎస్. వెంకట్రావు

భూమిని కాపాడుకుందాం

భూమి మానవునికి జీవనాధారం. ఈ అనంత విశ్వంలో ఇప్పటివరకు మానవునికి తెలిసి భూమి వంటి సజీవ గోళం మరోటి లేదు. భూగోళంపై జీవరాశి పరిణామ క్రమంలోనే విజ్ఞాన వంతుడైన మానవుడు ఆవిర్భవించాడు. తన విజ్ఞానంతో భూగోళాన్ని సుందర నందనంగా తీర్చిదిద్దుకోవలసిన మానవుడు, భూమ్మీద వనరులను ఉపయోగించుకుని ఆనందకరమైన జీవితాన్ని గడపాల్సిన మానవుడు దాన్ని సరిగ్గా నిర్వహించుకోలేక నాశనం చేస్తున్నాడు. భూమినీ, వాతావరణాన్నీ, భూమ్మీద వనరులనూ అస్తవ్యస్థం చేస్తున్నాడు. మానవ సమాజనిర్మాణంలోని వ్యవస్థాగత లోపాలే ఈ అస్తవ్యస్థ నిర్వహణకు కారణమవుతున్నాయి. తనకు ఆధారమైన భూమిని నాశనం చేయడమంటే తనను తాను నాశనం చేసుకోవడమే. అందువల్ల భూమిని కాపాడుకోవడం ఈ నాడు మానవాళి ముందు పెద్ద సమస్యగా మారింది.

planetearth
Earth Sciences for Society

ఈ సమస్యమీదకు ప్రపంచ ప్రజలందరి దృష్టినీ మళ్లించేందుకుగాను 2008వ సంవత్సరాన్ని 'అంతర్జాతీయ ధరిత్రీ సంవత్సరం'గా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ప్రపంచంలోని సుమారు 4 లక్షల మంది ధరిత్రీ శాస్త్రవేత్తల విజ్ఞానాన్ని మానవ సమాజం ఉపయోగించుకుని భూమిని మరింత భద్రమైన, ఆరోగ్యవంతమైన, సంపద్వంతమైన ప్రదేశంగా మార్చాలి అన్న ఉద్దేశ్యంతో ఈ వార్షికోత్సవాలను ప్రకటించారు. ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఫిబ్రవరి ప్రారంభంలో ఈ వార్షికోత్సవాలను ప్రారంభించారు. శాస్త్రవేత్తలకూ, విధాన నిర్ణేతలకూ మధ్యనున్న అంతరాన్ని పూడ్చుడం ఈ వార్షికోత్సవాల ముఖ్యోద్దేశం. అంటే ప్రపంచంలోని వివిధ దేశాల ప్రభుత్వాలు తమ తమ విధానాలు రూపొందించేటప్పుడు భూ వనరులనూ, వాతావరణాన్నీ దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు చేయాలి. అలా చేయాలంటే ధరిత్రీ శాస్త్రవేత్తలు అందించే సమాచారాన్ని వారు మరింత సమర్ధవంతంగా ఉపయోగించుకోవాలి. 2009 సంవత్సరం ఆరంభం వరకు ఈ వార్షికోత్సవాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప్రపంచ వ్యాపితంగా అనేక అంతర్జాతీయ కార్యక్రమాలు, వివిధ దేశాల్లో అనేక జాతీయ కార్యక్రమాలు జరుగుతాయి. ఐక్యరాజ్యసమితికి చెందిన విద్యా, విజ్ఞాన, సాంస్కృతిక సంస్థ (యునెస్కో), అంతర్జాతీయ భూవిజ్ఞాన శాస్త్రాల సంస్థ (ఐయుజిఎస్)లు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. వీటికి మరో 38 సంస్థలు సహకారం అందిస్తున్నాయి. 191 దేశాలు దీనికి రాజకీయ మద్దతు తెలిపాయి. 70 దేశాల్లో ఈ కార్యక్రమ నిర్వహణ కోసం జాతీయ కమిటీలు ఏర్పడ్డాయి.

ముఖ్యంగా భూమ్మీద మనిషి జీవనానికి అత్యవసరమైన పది అంశాలమీద ప్రపంచ వ్యాపితంగా కార్యక్రమాలు జరుగుతాయి. అవి: ఆరోగ్యం, వాతావరణం, భూగర్భ జలాలు, మహాసముద్రాలు, నేలలు, భూగర్భం, మహానగరాలు, పర్యావరణ ప్రమాదాలు, వనరులు, మానవ జీవనం. వివిధ దేశాలూ, ప్రాంతాలూ తమతమ ప్రాంతాలకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చు. అంతర్జాతీయ ధరిత్రీ సంవత్సరం సందర్భంగా జరిగే కార్యక్రమాల వల్ల భూమికి సంబంధించిన సమస్యలను అటు విధాన నిర్ణేతలు, ఇటు సామాన్య ప్రజలు కూడా అర్ధం చేసుకోడానికి వీలవుతుంది. అంతేకాకుండా ఈ సందర్భంగా అనేక మంది యువకులు భూ విజ్ఞాన శాస్త్రం పట్ల ఆసక్తి పెంచుకోడానికి ఈ కార్యక్రమాలు తోడ్పడతాయి. ఉదాహరణకు: 1957-58లో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరిగిన 'అంతర్జాతీయ భూభౌతిక సంవత్సరం' ప్రపంచమంతటా అంతరిక్షం పట్ల ప్రజల్లో విపరీతమైన ఆసక్తి పెంచింది. ఆ సందర్భంగా అమెరికా, రష్యా మధ్య ఏర్పడిన పోటీ అంతిమంగా రష్యా తొలి మానవ నిర్మిత ఉపగ్రహాన్ని ప్రయోగించడానికి దారితీసింది. ఆనాడు ఆ ఘటనలు అనేకమంది యువకులను ఈ శాస్త్ర రంగంలోకి ఆహ్వానించాయి. నేడు సాంకేతిక విద్య తప్పిస్తే శాస్త్ర విజ్ఞానం పట్ల యువతలో ఆసక్తి, అనురక్తి తగ్గుతున్న సమయంలో ఇటువంటి కార్యక్రమాల నిర్వహణ అవసరం ఎంతైనా వుంది. దాని వల్ల యువత మళ్లీ సైన్సు మార్గం పట్టే అవకాశాలు పెరుగుతాయి. 2002 సంవత్సరాన్ని జర్మనీలో 'భూమి సంవత్సరం'గా జరుపుకున్నారు. ఆ సంవత్సరం దేశంలో అనేకమంది యువకులు ఈ రంగంలో పరిశోధనల్లోకి ప్రవేశించారు. ఈ ఏడాది 'అంతర్జాతీయ ధరిత్రీ సంవత్సరం' సందర్భంగా కూడా ఇటువంటి ఫలితాలు వస్తాయని భావిస్తున్నారు. ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్) అందించే మాయా ఫలాలు అందుకునే తాపత్రయంలో మౌలిక విజ్ఞాన శాస్త్రాన్ని విడిచిపెట్టేసిన మన విధాన నిర్ణేతలకు ఈ అంతర్జాతీయ ధరిత్రీ సంవత్సరమన్నా కళ్లు తెరిపించాలనీ, మన యువతీయువకులకు శాస్త్రవిజ్ఞానం పట్ల ఆసక్తి పెంచాలనీ కోరుకుందాం!

❋

ప్రేమికుడు

భార్య: ఏవండీ! ఎదురింట్లో వుండే అతను నన్ను పదేళ్ల క్రితం పెళ్లి చేసుకుంటానన్నాడు. అప్పుడు నేను కాదన్నానని ఇప్పటికీ బాధపడుతూనే వున్నాడు. ప్రేమికుడంటే అలా వుండాలి కదండీ.

భర్త: [illegible]

బై పాస్

పేషెంట్: గుండె ఆపరేషన్‌ను బైపాస్ అని ఎందుకంటారు?

కాంపౌండర్: ఎందుకంటే ఆపరేషన్ బాగా అయితే పాస్. లేకపోతే ఎప్పటికీ బై.

లాంగ్ లివ్

సుబ్బారావు: డాక్టర్! ఎక్కువకాలం బతకాలంటే ఎలా!

డాక్టర్: పెళ్లి చేసుకోవయ్యా.

సుబ్బారావు: అప్పుడు ఎక్కువ కాలం బతుకుతానంటారా?

సుబ్బారావు: లేదు. అప్పుడు నీకు ఎక్కువ కాలం జీవించాలన్న కోరికే వుండదు.

ఏడుపు ఎందుకు?

(ఒక బస్సుకు యాక్సిడెంట్ అయ్యింది)

మొదటి వ్యక్తి: ఓ... నా చెయ్యి విరిగిందే... ఇక నేను ఏ చేత్తో తినాలి...

రెండో వ్యక్తి: ఎందుకయ్యా చెయ్యి విరిగినందుకే అలా ఏడుస్తావు? అతను చనిపోయాడు. అయినా ఏడవడం లేదు చూడు!

సిగ్గుతో చస్తున్నా...

యాపిల్: (ఏడుస్తుంటుంది...) వా...వా...

అరటిపండు: ఎందుకంతలా ఏడుస్తున్నావు?

యాపిల్: జనాలు మమ్మల్ని కత్తితో ముక్కలు ముక్కలుగా కోసుకొని మరీ తింటారు?

అరటిపండు: ఓస్. అంతే కదా. మమ్మల్ని చూడు. తోలు వలిచి మరీ తింటారు. సిగ్గుతో చస్తున్నాం.

ప్రే

శామ్: నువ్వు భోజనం చేయబోయే ముందు ప్రే చేస్తావా?

జో: లేదు. మా అమ్మ బాగా వంట చేస్తుంది.

ఏడాది తర్వాత

(ఒక అబ్బాయి అమ్మాయిని పెళ్లి చేసుకుంటానంటాడు. అప్పుడు)

అమ్మాయి: నేను నీకంటే సంవత్సరం పెద్ద దాన్ని కదా.

అబ్బాయి: పర్వాలేదు. నేను నిన్ను సంవత్సరం తర్వాత పెళ్లి చేసుకుంటాలే.

విజయ్, హైదరాబాద్.

గంట పట్టిందా!

అప్పారావు: ఓరే నిన్న నాతో ఒకడు గంటసేపు మాట్లాడి చివరికి నన్ను వెధవ అన్నాడ్రా!

సుబ్బారావు: ఓరే! అది తెలుసుకోవడానికి గంట పట్టిందా!

ఏం కూర?

ప్రియ: వదినా! ఈ రోజు మీ ఇంట్లో ఏం కూర!

సుశీల: బెండకాయల కూర! అవునూ... ఎందుకు అలా అడిగావ్!



ప్రియ: ఏం లేదులే. మా పెరటిలో ఏవరో కూరగాయలు కోస్తేనూ....

పూర్వ అనుభవం

గోపి: సర్! మీరు అంతా కొత్త ముఖాలతో (కొత్త వాళ్లతో) తీస్తున్న సినిమాలో నాకు కూడా ఒక వేషం ఇవ్వండి సార్, నా టాలెంట్..... చూపిస్తా!

దర్శక నిర్మాత: నీకు పూర్వ అనుభవం ఏమైనా వుందా?!

గోపి: ఆ...

కోరిక

అమ్మాయి తల్లి: మా అమ్మాయికి మీ అబ్బాయి నచ్చాడు. మరి మీ అబ్బాయికి మా అమ్మాయి నచ్చిందా?

అబ్బాయి తల్లి: ఓ! నచ్చింది వదినగారు! కాకపోతే మా అబ్బాయి వెరైటీగా ఆకాశంలో ఎగిరే విమానంలో పెళ్ళి చేసుకుంటానంటున్నాడు, ఇక విమానం అద్దెకు తీసుకోవడం మీ వంతు!

జె. సుధాకర్‌రావు
పట్నాయక్, కాకినాడ,
తూర్పుగోదావరి.



ఆహ్వానం

మీరు జోక్స్ బాగా వేస్తారా! వాటిని విన్న మీ స్నేహితులు, సహోద్యోగులు, ఇరుగుపొరుగు పడీపడీ నవ్వుతారా! మరైతే ఇంకా ఆలోచిస్తున్నారేంటండీ బాబూ. మా పాఠకులను కూడా మీ జోక్స్‌తో కడుపుబ్బా నవ్వించండి. గిలిగింతలు పెట్టండి. మీరు రుచికరమైన వంటలు, అల్పాహారాలు, పానీయాలు... చేస్తుంటారా. వెజ్, నాన్ వెజ్ కూరలు వెరైటీగా చేస్తుంటారా. వెంటనే ఓ కాగితం, పెన్నూ తీసుకోండి. మీరు మాకు పంపదలచుకున్న వంటకానికి కావాల్సిన పదార్థాలు, కొలతలు, వండే విధానం వివరంగా రాసి మాకు పంపండి. ప్రచురిస్తాం.

మా చిరునామా: ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి,
స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.

యాజీవ్

ముసురుకునే ఊసుల
ముస్సోరి



వేసవి విడిదిలా ఉండే మరో అందమైన, చూడవలసిన ప్రదేశం ముస్సోరి. ప్రస్తుతం ఉత్తరాఖండ్ రాష్ట్రం, డెహ్రాడూన్ జిల్లాలో ఉన్న ఈ పర్వత విడిదిని 1827లో యంగ్ అనే బ్రిటీష్ సైన్యాధికారి గుర్తించాడు. క్రమంగా అక్కడ జనావాసం ప్రారంభమైంది. సముద్రమట్టానికి 2550 మీటర్ల ఎత్తున్న ముస్సోరి నుండి హిమాలయ పర్వత శ్రేణి కనిపిస్తూ ఉంటుంది.

ఈ ప్రదేశం ఏడాది పొడవునా ఆహ్లాదకరమైన వాతావరణం కలిగి ఉండటం విశేషం. ముస్సోరి అనగానే లాల్‌బహదూర్ శాస్త్రి పేరున ఉన్న ఐఏఎస్ అకాడమీ గుర్తుకు వస్తుంది. దేశాన్ని నడపడానికి అవసరమైన శిక్షణని సివిల్ సర్వెంట్లు ఇక్కడే పొందుతారు.

ముస్సోరిలో మాల్, లైబ్రరీ చౌక్, లాండూర్ బజార్, క్లాక్ టవర్, కుర్లీ బజార్ వంటివి సందర్శకులకు మంచి స్థలాలు. గన్‌హిల్ అనే మరో ఎత్తైన ప్రదేశం తప్పకుండా చూడవలసినది. ఇది 2122 మీటర్ల ఎత్తు కొండ. ఇక్కడ నుండి ముస్సోరి పట్టణం, కింద ఉండే డూన్ లోయ చాలా అందంగా గోచరిస్తాయి. పూర్వకాలంలో ఈ కొండపై ఒక పెద్ద తుపాకి (గన్) ఉండేది. మధ్యాహ్నం ప్రాంతంలో టైమ్ తెలియ జేయడానికి దీనిని పేల్చేవారట. బ్రిటిష్ వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత దీనిని వాడటం మానేశారు. తరువాత దీనిని కరిగించి కొళాయిలుగా మార్చారు! గన్‌హిల్ పైకి కాలినడకన గానీ రోప్‌వే ద్వారా కానీ వెళ్లవచ్చు. మాల్ వైపు నుండి కూడా నడిచి పైకి వెళ్ళడం ఒక అనుభవం అయితే రోప్‌వేలో వెళ్తూ ప్రకృతి అందాన్ని ఆస్వాదించడం మరపురాని అనుభూతి.

ఒంటె ఆకారంలో ఒక సన్న రోడ్డుంది. దాని పేరు కేమెల్ రోడ్. దీని పైనుండి హిమాలయాల్లో సూర్యాస్తమయం చూడ్డం చెప్పలేని మధురానుభూతినిస్తుంది. చాలా మంది ఈ రోడ్డులో మార్నింగ్ వాక్ చేస్తుంటారు.

ముస్సోరిలోని బొటానికల్ గార్డెన్స్ కూడా చూడవలసినదే. దీనినే మునిసిపల్ గార్డెన్స్ అంటారు. బ్రిటిష్ వారి కాలంలో దీనిని కంపెనీ గార్డెన్స్ అనేవాళ్లు.

లాల్‌టిబ్బా లేదా డిపోహిల్ అనేది ముస్సోరిలో మరో ఎత్తైన ప్రాంతం ఇది ముస్సోరిలో అతి పురాతన స్థలం అని అంటారు. ఇక్కడ ఛిల్డర్స్ లాడ్జ్ ఉంది. ముస్సోరిలో కృత్రిమంగా నిర్మించిన సరోవరం కూడా ఉంది. ఇందులో బోటు షికారు చేస్తూ చుట్టూ ఉన్న పల్లెల్ని చూడటం భలే ఉంటుంది.

ముస్సోరిలో చాలా దేవాలయాలు, అద్భుతమైన జలపాతాలూ ఉన్నాయి. జలపాతాల్లో కాస్త పెద్దదైన కెమ్టీఫాల్స్ ముస్సోరికి 15 కీమీ దూరంలో ఉన్నాయి. నాలుగున్నర వేల అడుగుల నుండి దూకే జలపాతం ఐదు చిన్న జలపాతాలుగా చీలిపోయి అత్యంత సుందరంగా కనిపిస్తాయి. ఈ జలపాతాల్ని చూడకుండా తిరిగి వెళ్తే మాత్రం కచ్చితంగా ఏదో కోల్పోయినట్టే ఉంటుంది. ఈ జలపాతాల కింద స్నానం చేయడం కూడా మధురానుభవమే.

మరో బ్రిటిష సైన్యాధికారి స్వెటెన్‌హోమ్ తన భార్య కోసం ముస్సోరికి 18 కిమీ దూరంలో ఒక సుందర బంగళా నిర్మించాడు. దానిపేరు క్లౌడ్స్ ఎండ్ (మబ్బుల అంచు). నాలుగు వందల ఎకరాలలో ఉన్న ఈ ప్రదేశం ప్రస్తుతం ఒక రిసార్ట్ లాగా మార్చబడింది. అయినా అప్పటి సామాను, పుస్తకాలు, పెయింటింగులతో గొప్పగా ఉంటుంది. ఇక్కడి నుండి హిమాలయాలు, యమునా నది కనిపిస్తుంటాయి.

ముస్సోరిలో ముప్పైవేల కంటే తక్కువ జనాభా ఉంది. ప్రపంచ ప్రసిద్ధమైన బోర్డింగ్ స్కూళ్లున్నాయి. ఇక్కడే స్థిరపడ్డ టిబెటియన్లూ ఉన్నారు. మరీ చలికాలం (డిసెంబర్-ఫిబ్రవరి), వర్షాకాలం (జూలై - సెప్టెంబర్) ముస్సోరి చూడటానికి కాస్త ఇబ్బంది కలిగించవచ్చు. అయినా వణికించే చలి, కురిసే మంచు ఇష్టపడే వాళ్లకి ముస్సోరి సరైన ప్రదేశం. ❄



సమకాలీన ప్రపంచంలోనే సమున్నత మేధావి నోమ్ చామ్‌స్కీ భాషాశాస్త్రంలో విప్లవాత్మకమైన ప్రతిపాదనలు చేసి కొత్త మలుపు తిప్పిన చామ్‌స్కీ అమెరికా సామ్రాజ్యవాదంపై నిశిత విమర్శకుడు. అమెరికా రాజ్యవ్యవస్థనూ ఆమూలాగ్రం శోధించి ఆ ఆధిపత్య వాదపు అసలు స్వభావాన్ని ప్రపంచానికి తెలియజెప్పే అనేక గ్రంథాలు రాశాడు. రాజకీయంగా సాంస్కృతికంగా సామ్రాజ్యవాదాన్ని అర్థం చేసుకోవాలంటే చామ్‌స్కీని చదవడం తప్పని సరి. కార్పొరేట్ ప్రపంచపు మార్కెట్ వ్యూహాలనూ ప్రత్యేకించి మీడియా రంగంలో దాని పరోక్ష నియంత్రణను ఎండగట్టిన చామ్‌స్కీ అంతర్జాతీయ స్థాయిలో అత్యంత ప్రామాణిక విశ్లేషకుడుగా గౌరవం పొందుతున్నారు. అసంఖ్యాకమైన చామ్‌స్కీ రచనల నుంచి ముఖ్యమైన భాగాలను ఏరికూర్చిన సంకలనం 'ఆలోచనే ఆయుధంగా'. అరవై పేజీల ఈ పుస్తకంలో చామ్‌స్కీ భావాలు రేఖామాత్రంగా పరిచయం అవుతాయి.



విశ్వ మేధావి విలువైన భావాలు

రెండు మినహా ఈ పుస్తకంలో అంశాలు 1987-99 మధ్య కాలంలో వచ్చినవి (ఒకటి 1967లో వియత్నాం యుద్ధ కాలంలో రాసింది కాగా మరొకటి సెప్టెంబరు 11 నేపథ్యంలో రాసింది). అయినా వాటిలో విషయాలను బట్టి చూస్తే దాని దుష్టస్వభావం ఎప్పుడూ ఒకటేనని స్పష్టమవుతుంది.

'ఆలోచనే ఆయుధంగా' అన్న టైటిల్ వ్యాసంతో పుస్తకం మొదలవుతుంది. 1980వ దశకంలో ఇతర దేశాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం కోసం అమెరికా తన తొత్తులుగా వున్న దేశాల్లోని కిరాయి మూకలతో కలసి టెర్రరిస్టు వలను అల్లిన తీరును ఈ వ్యాసంలో ప్రస్తావిస్తారు. ప్రత్యక్షంగా సైన్యాలను పంపించడం కన్నా మెరుగైందని, సులభమైందని భావించినందునే ఈ పద్ధతిని ఎంచుకున్నట్టు కూడా ఆయన చెబుతారు. చిలీతో సహా అనేక లాటిన్ అమెరికన్ దేశాలలో అమెరికా జోక్యం గురించి సైనిక కేంద్రం పెంటగాన్ పత్రాలలో వివరంగా చూడొచ్చని కూడా వెల్లడిస్తారు. ఇక 'రహస్య పత్రాలు' అన్న రెండవ వ్యాసంలో అమెరికా తన గుట్టు బట్టబయలు చేస్తారని భావించిన వారిని శిక్షించేందుకు లేనిపోని ఆరోపణలు ఎలా చేస్తుందో చెప్పారు. 1953లో దేశ రహస్యాలు బయటపెట్టారన్న ఆరోపణతో రోజెన్‌బర్గ్ దంపతులకు మరణశిక్ష విధించడానికీ ఇదే కారణం. గ్రీకుల కాలం నుంచి కూడా ప్రభుత్వాలు తన చర్యల చుట్టూ నిగూఢతను సృష్టించేందుకు యత్నిస్తున్నాయి. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో అమెరికా ఆత్మరక్షణ కోసం రష్యా వ్యతిరేకతను బూచిగా చూపిందని కూడా చామ్‌స్కీ నిరూపించారు. హిట్లర్ తర్వాత అత్యంత ఎక్కువగా అయిదు లక్షల మందిని పొట్టనబెట్టుకున్న ఇండోనేషియా అధ్యక్షుడు సుహార్తో అమెరికాకు మితవాదిగా కనిపించడం ప్రస్తావించి తన వ్యూహాన్ని బలపరుస్తారా లేదా అని తప్ప ఆయా దేశాల పాలకుల అసలు స్వభావాలు అమెరికాకు అనవసరమని సోదాహరణంగా చెప్పారు. 'అమెరికాలో మత ఛాందసత' అన్న మరో వ్యాసంలో ఆయన మత దురహంకారం ఫాసిజానికి దారి తీస్తుందని హెచ్చరిస్తాడు.

ఆచరణకు దిగి పోరాడాలి తప్ప వూరికే మాటలతో మార్పు రాదంటూ ఈ సమాజంలో మార్కెట్ శక్తులు ప్రేక్షకులను ఎడ్యుకేట్ చేయడం కాదు, డీ ఎడ్యుకేట్ చేస్తున్నారని 'కార్పొరేట్ రాజ్యం' అన్న మరో వ్యాసంలో విమర్శిస్తాడు. న్యూయార్క్ టైమ్స్, వాషింగ్టన్ పోస్ట్ వంటి పత్రికలు మేధావులను అధికారులను ఉన్నతాదాయ వర్గాలనూ ప్రభావితం చేస్తాయి. అలాగే కార్పొరేట్ క్యాపిటలిజం అంతరిస్తే తప్ప నిజమైన ప్రజాస్వామ్యం వీలుపడదని మరోచోట స్పష్టం చేస్తాడు. తమ వ్యాపార ప్రయోజనాల కోసమే ఇండియాను ఆక్రమించి అక్కడ పత్తిపంటను నాశనం చేసి మాంచెస్టర్ జౌళి పరిశ్రమను కాపాడుకున్నారని గుర్తు చేస్తాడు. ఆయా దేశాల ప్రజలు ఆయా రాజకీయ వ్యవస్థల్లో బతుకుతుండవచ్చు గాని కార్పొరేషన్లకే ఏ హద్దులూ లేవని 'గ్లోబల్ పెట్టుబడి'లో విమర్శిస్తాడు. ప్రపంచాన్ని కబళించి వేస్తున్న బడా కార్పొరేషన్ల చేతుల్లో ఎంతో అధికారం పోగుపడి దేశాధినేతలను కూడా ఖాతరుచేయని స్థితి చట్టాల వల్ల సంక్రమించింది కాదు. జడ్జీలూ లాయర్లూ చట్టం చేతులు కట్టివేసి ఇచ్చిన తీర్పులవల్లనే అవన్నీ పోగుపడ్డాయని 'అసలైన నియంత' వ్యాసంలో విశ్లేషిస్తాడు. సెప్టెంబరు 11 తర్వాత అమెరికా టెర్రరిజంపై యుద్ధం పేరుతో ప్రతీకార దాడులకు దిగడాన్ని గురించి ద్వేష ప్రచారంలో వివరిస్తాడు.

ఇక సమాజంలో మార్పు సాధించడానికి సమిష్టి కృషి, పోరాటం అవసరమని ఆయన అనేక చోట్ల చెబుతాడు.'సామాజిక సమస్యలు ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తే అవగాహన కావు. అందరం కలసి కూర్చుని చర్చించాలి.సామాజిక సమస్య అంటే మనను మనం సామాజికంగా అర్థం చేసుకోవడమే. సామాజిక శాస్త్రం ఒక సిద్ధాంతం కాదు- ఆచరణతో అర్థం చేసుకునే ప్రయత్నం' అని ఆయన 'వార్తల వెనక వ్యాసం'లో వివరిస్తాడు. అదే విధంగా ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం చాలా సులభమేనని ' కామన్ సెన్స్ చాలు' అన్న వ్యాఖ్యలో చెబుతాడు. 'పదిహేనేళ్ల కుర్రాడికి

అర్థం కాని ప్రపంచ సమస్యలంటూ ఏమీ లేవు. కొద్దిగా సమాచారం సేకరించి చదివి ఆలోచించి - మరీ అంత లోతుగా అక్కర్లేదు- విశ్లేషించగలిగితే చాలు. ప్రపంచ సమస్యలను గురించి మాట్లాడ్డానికి ప్రత్యేక అర్హత లుండాలనుకోవడమే పెద్ద భ్రమ. కామన్‌సెన్స్ ప్రత్యేక అర్హత కాదు' అని భరోసా ఇస్తాడు. పాలక వర్గ పార్టీలు అంతర్జాతీయ సమస్యలను ఎప్పుడూ ప్రస్తావించకపోవడానికి కారణం అవకాశవాదమే తప్ప అవగాహన లేకపోవడం కాదని ఈ మాటలు స్పష్టం చేస్తాయి. లక్షల మంది స్థూలంగా నమ్ముతున్న విలువల కోసం ఉద్యమిస్తేనే మార్పు సాధ్యమని మరో వ్యాసంలో పిలుపునిస్తాడు. మార్టిన్ లూథర్ కింగ్ అయినా మహాత్మాగాంధీ అయినా లక్షలాది మంది పాత్ర లేకుండా వ్యక్తిగతంగా మార్పు తేగలిగేవారని అనుకోవడం సరికాదని 'నాయకుల గురించి'లో చెబుతాడు. స్వతహాగా మహామేధావిగా వున్నా విశాల జనరాశుల కదలిక అవసరాన్ని గుర్తించడం ఆయన ప్రజాస్వామిక స్వభావానికి నిదర్శనం. 'అహింస గురించి' అన్న వ్యాసంలో సాధారణంగా అధికార వర్గాలే హింసకు పాల్పడుతుంటాయని' వివరిస్తాడు. ప్రజల సంఘటిత శక్తి ఒక్కటే హింసకు విరుగుడని ప్రజలు ఎంత ఎక్కువగా సంఘటితమైతే హింస అంత తగ్గే అవకాశముంటుందని చెబుతాడు. 'ఏది నిజం?' అన్న వ్యాసంలో చామ్‌స్కీ సామాజిక క్రియాశీల బృందాల్లో చేరడం ద్వారానే ఎవరైనా ప్రత్యామ్నాయ సమాచారం పొందగలుగుతారని సూచిస్తాడు. న్యూ లెఫ్ట్ అని పిలవబడే అమెరికా రాజకీయ స్రవంతికి చెందిన చామ్ స్కీ మార్క్సిజంలో తను ఆమోదించే అంశాలను విభేదించే వాటిని కూడా పేర్కొన్న వ్యాసం ఒకటుంది.

ఈ సంకలనంలో ఎక్కువ భాగం చిన్న ఖండికలే అయినా 'నీతి-సంస్కృతి', 'మేధావుల బాధ్యత' అన్న రెండు పెద్ద వ్యాసాలు కూడా వున్నాయి. వున్నంతలో అనేక సంఖ్యా వివరాలు, సమాచార వనరులు లభిస్తాయి. సీనియర్ రచయిత-అనువాదకుడు ముక్తవరం పార్థసారథి వీటిని ఎంపిక చేసి అందించారు. ఆయన అనువాదం కూడా చాలా సరళంగా సుబోధకంగా సాగుతుంది. అందుకే ఈ పుస్తకం చిన్నదైనా చాలా విలువైంది. అహరహం అంతర్జాతీయ సమాజాన్ని గురించి ఆలోచించే విప్లవ మేధావి భావాలను తెలుసుకోవడం ప్రతి సామాజిక కార్యకర్తకూ అవసరమే.

ఆలోచనే ఆయుధంగా
నోమ్ చామ్‌స్కీ
కూర్పు - అనువాదం
ముక్తవరపు పార్థసారథి
వెల: 20/-,
పేజీలు:59
ప్రతులకు:
ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1/2, చిక్కడపల్లి,
హైదరాబాద్-20.

✻









సీరియల్

మూలం : **బరీ మై హార్ట్ ఎట్ ఊండెడ్ నీ (డీ బ్రౌన్)**

తెలుగు సేత: **ముక్తవరం పార్థసారథి**



స్పాటెడ్ టెయిల్

అమెరికన్ దేశ

జరిగినకథ: మరో మూడు నెలల తర్వాత, ఈ మరణ వార్త తెలిసి మామంటి కూడా అకస్మాత్తుగా ప్రాణాలు వదిలాడు. ఇదంతా కికింగ్‌బర్డ్ మంత్రశక్తే అన్నారు ఇండియన్లు.

"తన మరణాన్ని తానే శాసించుకుని, సాటి మనిషిని కూడా చంపగల మహిమ వుందతనికి".

మూడు సంవత్సరాల తర్వాత, జైలు జీవితాన్ని భరించలేక (టెక్సాస్‌లో) మేడ కిటికీలో నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు సాటాంటా. అదే సంవత్సరం, మలేరియా జ్వరంతో బాధపడుతున్న లోన్‌వూల్ఫ్‌ను ఫోర్ట్‌సిల్‌కు తిరిగి రావటానికి అనుమతించారు. కాని అతడు కూడా ఏడాది తిరక్కుండానే మరణించాడు.

గొప్ప నాయకులెవరూ మిగల్లేదు. కియోవాలు, కొమాంచీల ప్రాభవం దిగజారింది. ప్రాణాలొడ్డి వాళ్ళు రక్షించాలనుకున్న 'బఫెలో' అంతరించింది. కేవలం, పదేళ్ల కాలంలో జరిగిన పరిణామాలివి.

(44వ భాగం)

"ఈ భూ ప్రపంచానికే కేంద్ర బిందువు బ్లాక్ హిల్స్. పది దేశాల సియో ప్రజలు ఈ విషయం అంగీకరిస్తారు"

- టాటోంకే ఇన్యాంకే (రన్నింగ్ ఆంటిలోప్)

"గ్రేట్ ఫాదర్ పంపిన మనుషులు మా కొండల్లో నుండి బంగారం అపహరించుకుపోతున్నారు. దీనికి ప్రతిగా, మా తెగవాళ్ళందర్నీ మీరు జీవిత కాలం పోషించాలి.

- మాటో నూపా (టూ బేర్స్)

"బ్లాక్ హిల్స్ మీద ఇండియన్లకు మాత్రమే హక్కున్నదని" గ్రేట్ ఫాదర్, కమిషనర్లకు చెప్పాడు. అందువల్ల ఇండియన్ల నిర్ణయాల్ని అందరూ గౌరవించాలి.

తెల్లవాళ్ల అభిప్రాయాన్ని మేం గౌరవిస్తున్నాం గనక, వాళ్ళు మమ్మల్ని మూర్ఖులుగా చూస్తున్నారు.

- షుంకా విట్కో (ఫూల్ డాగ్)

"సంపదను దాచుకోవటానికి గ్రేట్ ఫాదర్ వద్ద ఒక భోషాణముంది. మా భోషాణం బ్లాక్‌హిల్స్. వాటినాక్రమించుకున్నందుకు మీరు మాకు 70 మిలియన్ డాలర్లు చెల్లించాలి. ఆ డబ్బు మీద వచ్చే వడ్డీతో మేం పశువుల మంద కొనుక్కొంటాం. తెల్లవాళ్ళు ఇలాగే ఆలోచిస్తారు. గదూ!"

- మాటోగ్లెస్కా (స్పాటెడ్ బేర్)

మా కొండల్ని కొల్లగొట్టి కడుపులు నింపుకుంటున్నారు మీరు. మమ్మల్ని నిలువుదోపిడీ చేసినా మీకు తృప్తి లేదా? తెల్లవాళ్ళు మాకే కాదు. ప్రకృతికే ద్రోహం చేస్తున్నారు."

- డెడ్ ఐస్

"ఈ నేల వదిలి నేనెక్కడికీ పోను. నా పూర్వీకుల అస్తికలన్నీ, ఇక్కడే వున్నాయి. కొన్నాళ్లకు నేనూ వాళ్లతో కలిసిపోతాను."

- షుంకాహో నాపిన (ఉల్ఫ్ నెక్లెస్)

"నా బంగారం దోచుకుపోతున్నారు. అయినా నేను వాళ్లను నివారించలేకపోతున్నాను. మిత్రులారా, వాషింగ్టన్‌లో నేను వాళ్ళ ధనాగారం చూశాను.

ఎవరూ అందులోని డబ్బు ముట్టుకోవటానికి వీల్లేదు. కాని ఇక్కడ, గ్రేట్‌ఫాదర్ పంపగా వచ్చిన మనుషులు మన ధనాగారాన్ని (బ్లాక్‌హిల్స్) ఖాళీ చేస్తున్నారు."

- మావటానీ హన్స్కా (లాంగ్ మాండన్)

"మిత్రులారా, ఇన్నేళ్లుగా మనం సమస్యల గురించి ఎవరికీ చెప్పుకోలేదు. పరిష్కారం కోసం గ్రేట్ ఫాదర్ నాశ్రయించలేదు. కాని వాళ్ళు మాత్రం రోజూ వచ్చి మనల్ని ఇబ్బంది పెడుతున్నారా లేరా? సముద్రాలు దాటి వాళ్ళిక్కడికి వచ్చారు. ఈ భూమిని కొనుక్కుంటారట. రత్నగర్భలాంటి ఈ భూమి మరెక్కడైనా వుందా? దీన్ని డబ్బుతో కొనుక్కోవటం మానవ మాత్రులకు సాధ్యమా? మాదేశాన్ని మేం అమ్ముకోం. తరతరాల ఇండియన్లదీ నేల."

- కాంగీ ఇయాకా (క్రో ఫెదర్)

"పశువుల సంపదను నాశనం చేశారు. మిగిలింది కొండలే. ఇప్పుడు, అవీ కావాలంటున్నారు. ఇక్కడ వున్నన్ని ఖనిజాలు మరెక్కడా లేవు. ఈ పైన్ చెట్ల వనాలు మా అవసరాలన్నీ తీరుస్తాయి. ఇవన్నీ వదులుకుంటే మా ప్రాణాలు వదులుకున్నట్టే."

- వాంగీ స్కా (వైట్ ఘోస్ట్)

"ప్రెయిరీ తగలబడ్డప్పుడు, జంతువులు ఆ మంటల్లో చిక్కి కాలిపోకుండా అటూ ఇటూ పరిగెత్తుతాయి. మా పరిస్థితి ఇప్పుడలాగుంది."

- నాజిన్యానూపి (సరౌండెడ్)

"రెడ్‌క్లౌడ్, స్పాటెడ్ టెయిల్, ఇతర టెటాన్ తెగలు నెబ్రాస్కాలోని రిజర్వేషన్లకు చేరుకున్న కొద్ది రోజులకే, బ్లాక్‌హిల్స్‌లో బంగారు నిల్వలు వున్నాయన్న వదంతులు వ్యాపించాయి. పాహాసాహా (బ్లాక్‌హిల్స్) భూమికి కేంద్రం. దేవతలుంటారిక్కడ. అత్యంత పవిత్రమైన పర్వతశిఖరాలివి. వీరయోధులక్కడికెళ్లి గ్రేట్ స్పిరిట్‌తో సంభాషించి భవిష్యత్తు గురించి తెలుసుకుంటారు. 1868లో గ్రేట్ ఫాదర్‌కివి పనికిరాని రాళ్ల గుట్టలుగా కనిపించాయి. అందువల్లనే, ఇండియన్లను తీసుకొమ్మన్నాడు (ఒప్పందం కూడా రాసుకున్నాడు). నాలుగేళ్ళ తర్వాత, ఖనిజాల వేటలో, తెల్లవాళ్లు అక్కడ మైనింగ్ చేపట్టారు. పాహాసాహా పవిత్రత మంట గలిసింది. కొండ చరియల్లో సెలయేళ్లలో బంగారం కోసం వేట ప్రారంభమైంది. తమకు పుణ్యక్షేత్రం లాంటి కొండల్ని తొలుస్తున్న తెల్లవాళ్లను, ఇండియన్లు ఎదిరించారు. పారిపోని వాళ్లను చంపేశారు. 1874 నాటికి అమెరికన్లలో గోల్డ్‌హంగర్ పెరిగింది. సైన్యం బ్లాక్ హిల్స్‌ను ఆక్రమించుకుంది. యునైటెడ్ స్టేట్స్

వసంతకాలం నాటికి, బ్లాక్ హిల్స్‌లో బంగారు నిల్వలున్న మన్న వదంతులు దేశమంతా వ్యాపించాయి. వందలాది మంది మైనర్లు, మిస్సోరీ నది దాటి, థీవ్స్ రోడ్ మీదగా అక్కడికి చేరుకున్నారు. ఈ మైనర్లను (వీళ్లను 'ప్రాస్పెక్టర్' లంటారు) అడ్డుకొమ్మని ప్రభుత్వం సైనికులను పంపింది. అయినా, ప్రాస్పెక్టర్ల దండు ఆగలేదు. చట్టపరంగా వాళ్లపైన ఏ చర్యా తీసుకోలేదు. జనరల్ "బ్లాక్‌హిల్స్‌లో కనీసం వెయ్యిమంది ప్రాస్పెక్టర్లు బంగారం కోసం గాలిస్తున్నారు. ఇదిగాక రోజూ అనేక మంది కొత్తవాళ్ళు వచ్చి చేరుతున్నారు. "బంగారు దొరుకుతుందంటే చట్టానికి భయపడతారా?" అని నివేదిక పంపాడు జనరల్ క్రూక్.

గవర్నమెంట్‌కు, ఇండియన్ల అంగీకారం తీసుకోవాలనే ఆలోచన కూడా రాలేదు. వాళ్ల అనుమతితో ఇక్కడ ప్రవేశించాలన్న 1868 నాటి ఒడంబడిక కాగితాలకే పరిమితమైంది.

'మూన్ ఆఫ్ రెడ్ చెర్రీస్' (రుతువు)లో వెయ్యికి పైగా అశ్విక సైనికులు, మైదానాలలో వున్న ఫోర్ట్ అబ్రహాం లింకన్ నుండి బ్లాక్‌హిల్స్‌కు బయల్దేరారు. ఈ కెవల్రీకి నాయకుడు జనరల్ జార్జి ఆర్మ్‌స్ట్రాంగ్ కస్టర్. 1868లో వాషిటా వద్ద బ్లాక్ కెటిల్‌కు చెందిన దక్షిణ షెయెనీలను వూచకోత కోసిందీ మహానుభావుడే. సియోలు ఇతనికి పెట్టిన పేరు 'పాహుస్కా' అంటే 'లాంగ్ హెయిర్'. కస్టర్ రాక గురించి సమాచారం లేని ఇండియన్లు, బ్లూ యూనిఫాం వేసుకున్న సైనికులు, కాన్వాస్ కప్పిన సప్లై వ్యాగన్లతో తమ గ్రామాలను చేరుకున్న దాకా ఏం జరుగుతున్నదో తెలుసుకోలేకపోయారు.

"జనరల్ కస్టర్ బ్లాక్‌హిల్స్‌కు రావటం ప్రమాదకరమే. అదంతా ఓగ్లాల సియో ప్రాంతం గదా!" అంటూ తన అభ్యంతరం తెలియజేశాడు రెడ్‌క్లౌడ్. నిజానికి, షెయెనీలూ, అరాపాహోలూ ఇతర సియో తెగలవాళ్ళు కూడా వుంటున్నారక్కడ. ఇండియన్ల కోపాన్నీ అసంతృప్తినీ అర్థం చేసుకున్న గ్రేట్‌ఫాదర్ యులిసిస్ గ్రాంట్ "చట్ట ప్రకారం వాళ్లకు కేటాయించిన ప్రాంతమది. ఇండియన్లు తప్ప మరెవ్వరూ అక్కడికెళ్లగూడదు" అని ఒక తాకీదు జారీ చేశాడు.

కాని, కొండల్లో బంగారముందన్న కస్టర్ ప్రకటన విని తెల్లవాళ్ళు మిడతలదండులా వచ్చి పడ్డారు. బ్లాక్ హిల్స్‌లో మైనింగ్ చెయ్యని ప్రాంతమంటూ మిగల్లేదు. "పాహోసాపా"కు కస్టర్ వేసిన దారిని థీవ్స్ రోడ్ (దొంగల దారి) అంటారు.

ఆ వేసవిలో, ఓగ్లాలాలకు వస్తున్న రేషన్ నాసిరకంగా వుంటున్నదని రెడ్‌క్లౌడ్, రిజర్వేషన్ ఏజెంట్ జె.జె. సెవిల్‌తో గొడవపడ్డాడు. అయితే, అంత కన్నా పెద్ద ముప్పు పొంచి వుందని అతడు గ్రహించలేకపోయాడు. కస్టర్ సైనికుల రాక, ఇండియన్ల మనుగడకే శాపంగా పరిణమించబోతున్నది. వయసుమీద పడిన వృద్ధులందరిలాగే, రెడ్‌క్లౌడ్‌కూడా గిల్లి కజ్జాలే తిరుగుబాట్లనుకునే భ్రమలో వున్నాడు. యువ నాయకత్వంతో సంబంధాలు లేకపోవటం కూడా అందుకో కారణం.

కస్టర్ ఆగమనం తర్వాత, శిశిరరుతువులో వేటకెళ్లిన సియోలు రెడ్‌క్లౌడ్ ఏజెన్సీకి తిరిగి వచ్చారు. 'పాహోసాపా'ను సైన్యం ఆక్రమించిన విషయం తెలిసి వాళ్లకు కోపం కట్టలు తెంచుకుంది. మైనింగ్ చేస్తున్న దుండగుల మీద యుద్ధం ప్రకటించాలన్నారు. ఓపిక పట్టమన్నాడు రెడ్‌క్లౌడ్. గ్రేట్‌ఫాదర్ కన్నీ తెలుసు. ఈ దాడులను ఆయనే ఆపుతాడు. ఇండియన్లకిచ్చిన మాట నిలబెట్టుకోవాలని తెలియదా! కాని, కొద్ది రోజులకే, "మూన్ ఆఫ్ ఫాలింగ్ లీవ్స్" లో జరిగిన ఒక సంఘటన రెడ్‌క్లౌడ్ కళ్లు తెరిపించింది. అక్టోబర్22 నాడు ఒక పైన్ వృక్షం కొట్టి తీసుకురమ్మని (కంచెకు అడ్డుగా పెట్టటానికి) తన మనుషుల్ని పంపించాడు సెవిల్. ఇంత పొడుగాటి చెట్టునేం చేస్తారో తెలియక ఇండియన్లు దాన్ని తరలించటాన్ని అడ్డుకున్నారు. జెండాకర్రగా వుపయోగిస్తామని నచ్చచెప్పబోయాడు సెవిల్.

"అప్పటికే బ్లాక్‌హిల్స్‌లో ఎక్కడ చూసినా తెల్లవాళ్ల జెండాలే ఎగురుతున్నాయి. ఇప్పటికే ఎక్కువైనాయి. ఇక కొత్త జెండాలను అనుమతించమన్నారు" ఇండియన్లు.

ఈ ఫిర్యాదులనూ, నిరసనలనూ పట్టించుకోక, జెండా పాతటానికి రంధ్రం తవ్వటానికి వుపక్రమించాడు ఏజెంట్. అంతే కొద్ది నిమిషాల్లోనే ఓ గుంపుగా వచ్చిన ఇండియన్ యువకులు గొడ్డళ్లతో జెండాకర్రను ముక్కలుగా నరకటం ప్రారంభించారు.

'ఈ పిచ్చి పనులు మానమని' కసురుకున్నాడు సెవిల్. తగాదా నివారించటం కోసం రెడ్‌క్లౌడ్ వద్దకెళ్ళి పరిస్థితిని వివరించాడు. యువకులు కస్టర్ మీద కోపం ప్రదర్శించ డానికి కారణం – సైనికులను బ్లాక్ హిల్స్‌లోకి తీసుకురావడమే. తన కలుగచేసుకోనన్నాడు రెడ్‌క్లౌడ్.

ఇంక చేసేది లేక, ఫోర్ట్‌రాబిన్సన్ నుండి అదనపు అశ్వికదళాలను రప్పించాడు సెవిల్. కొద్ది గంటల్లోనే యుద్ధవాతావరణం నెలకొంది. మొహాలకు రంగు పులుముకుని యుద్ధసన్నద్ధులై ఎదురునిల్చారు ఇండియన్లు. ఇంతా చేస్తే ఫోర్ట్ నుండి వచ్చింది ఒక లెఫ్టినెంటూ, ఇరవై ఆరు మంది సైనికులే. ఇండియన్లు వలయంగా ఏర్పడి వాళ్లను బంధించారు. భయపెట్టటానికి గాలిలో కాల్పులు జరిపారు. కేకలు వేశారు. లెఫ్టినెంట్ (ఎమ్మెట్ క్రాఫోర్డ్) భయపడలేదు. గుర్రాల కదలికతో బాగా దుమ్ములేచింది. సైనికులను ప్రశాంతంగా ఏజెన్సీ వైపు కదలమని ఆదేశించాడు క్రాఫోర్డ్. కొందరు ఇండియన్ యువకులు సైనికుల గుర్రాలకు తమ గుర్రాలను ఢీ కొట్టి యుద్ధానికి రెచ్చగొట్టారు.

అయితే, ఈసారి క్రాఫోర్డ్ రక్షణకు వచ్చింది. మరో సైనిక దళం కాదు. ఓల్డ్ – మాన్ – అఫ్రైయిడ్‌కు కుమారుడు యంగ్-మాన్ అఫ్రైయిడ్- ఆఫ్ -హిస్- హార్సెస్ ఒక సియో బృందంతో సైనికులకు రక్షణకవచం లా నిలిచాడు. రెండు గ్రూపుల మధ్యా యుద్ధం జరిగేదేగాని, రెడ్‌డాగ్, ఓల్డ్ మాన్- అఫ్రైయిడ్ కనీసం తాత్కాలికంగా పరిస్థితి చేయి దాటకుండా చూశారు.

కలహించుకున్న దాయాదుల మధ్య రాయబారం నడపటానికి రెడ్‌క్లౌడ్ మళ్లీ నిరాకరించాడు. యువకులకు కోపం వచ్చింది. తమ టెపీలు పీకేసి, రిజర్వేషన్ వదిలి వుత్తరంగా తరలివెళ్లారు. పాహోసాపాను ఆక్రమించుకున్న వాళ్ల పట్ల కూడా రెడ్-క్లౌడ్ ఇంత సహనం ప్రదర్శిస్తాడా? ఇది అతడి మూర్ఖత్వమే. ప్రాణత్యాగాలకు సిద్ధపడ్డ యువకులే లేకపోతే రెడ్ క్లౌడ్ విలువెంత!

అప్పటికి, తెల్లవాళ్ళ ముందు చేయి చాపకుండా, స్వేచ్ఛగా బతుకుతున్న తెగ నాయకులిద్దరు – ఒకరు సిట్టింగ్‌బుల్. మరొకరు క్రేజీహార్స్. రెడ్‌క్లౌడ్‌ను వదిలి వెళ్ళిన యోధులు వీళ్లతో చేతులు కలిపారు.

1875 వసంతకాలం నాటికి, బ్లాక్ హిల్స్‌లో బంగారు నిల్వలున్నాయన్న వదంతులు దేశమంతా వ్యాపించాయి. వందలాది మంది మైనర్లు, మిస్సోరీ నది దాటి, థీవ్స్ రోడ్ మీదగా అక్కడికి చేరుకున్నారు. ఈ మైనర్లను (వీళ్లను 'ప్రాస్పెక్టర్' లంటారు) అడ్డుకొమ్మని ప్రభుత్వం సైనికులను పంపింది. అయినా, ప్రాస్పెక్టర్ల దండు ఆగలేదు. చట్టపరంగా వాళ్లపైన ఏ చర్యా తీసుకోలేదు. జనరల్ "బ్లాక్‌హిల్స్‌లో కనీసం వెయ్యిమంది ప్రాస్పెక్టర్లు బంగారం కోసం గాలిస్తున్నారు. ఇదిగాక రోజూ అనేక మంది కొత్తవాళ్ళు వచ్చి చేరుతున్నారు. "బంగారం దొరుకుతుందంటే చట్టానికి భయపడతారా?" అని నివేదిక పంపాడు జనరల్ క్రూక్.

పెరిగిపోతున్న తెల్లవాళ్ల ప్రవాహాన్ని ఆపమని వాషింగ్టన్‌ను ప్రార్థించారు రెడ్‌క్లౌడ్, స్పాటెడ్ టెయిల్.

"ఇండియన్లు స్వచ్ఛందంగా బ్లాక్‌హిల్స్ మీద హక్కు వదులుకోవటానికి ఒప్పించమని" ఒక కమిషన్ పంపాడు గ్రేట్‌ఫాదర్. అంటే, వాళ్లను మాతృదేశంలోనే నిర్వాసితులను, చెయ్యటానికి సెట్లర్లు చేసిన మరో కుట్ర.

ఇంకా వుంది....

మనసా... తెలుసా?

హిప్నో కమలాకర్
ఫోన్ నెం: 9390044031

ఏకాగ్రత వుండడంలేదు

నేను డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. ఫస్టియర్, సెకండియర్‌లో 55 శాతం మార్కులు వచ్చాయి. ఈ సంవత్సరం 90 శాతం మార్కులు వస్తే మూడేళ్లకు కలిపి 65 శాతం వస్తుంది. అందుకోసం రోజుకి ఎనిమిది గంటలు కష్టపడుతున్నాను. కానీ చదివినవేవీ గుర్తుకు రావడం లేదు. దీని వల్ల ఏకాగ్రత కోల్పోతున్నాను. దీనికి మంచి పరిష్కారం తెలుపగలరు?

సాగర్, మహబూబ్‌నగర్.

ఏకాగ్రత నిలవాలంటే మీ ఇంద్రియాలు చక్కగా సమర్థవంతంగా పని చేయాలి. కాంతి తక్కువగా ఉన్న గదిలో, శబ్దాలు ఎక్కువగా వస్తున్న చోట కూర్చుని చదవటం వల్ల ఏకాగ్రత దెబ్బతింటుంది. ఒక విషయాన్ని నిశితంగా గమనించటం, లోతుగా అర్థం చేసుకోవటం చాలా అవసరం. మీ సామర్థ్యం మీదే ఏకాగ్రత యొక్క శక్తి సామర్థ్యాలు, తీవ్రత ఆధారపడి వుంటాయి. మిమ్మల్ని వేధించే వాటిని పక్కకు పెట్టి చదువు మీద దృష్టి పెట్టగల నేర్పును అలవర్చుకోండి. ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకోండి. ఎనిమిది గంటలపాటు ఏకధాటిగా చదవకుండా అరగంటకు ఒకసారి ఐదు, పది నిమిషాలు గ్యాప్ ఇస్తూ చదవండి. ఆ 5-10 నిమిషాలు మీరు చదివిన ముఖ్యమైన అంశాలను మననం చేసుకోండి. తిరిగి కొత్త విషయాలను మననం చేసుకోండి. ఇలా చేస్తే మీ ఏకాగ్రత చక్కగా వుంటుంది.

లోపాన్ని ఎత్తి చూపితే సహించలేను

నా వయస్సు 16 సంవత్సరాలు. నేను 10వ తరగతి చదువుతున్నాను. నాకు డాక్టర్ అవ్వాలని చాలా ఆశ. కానీ నా ఎడమ చేతికి నాలుగు వేళ్ళు లేవు. ఎవరైనా దానిని గురించి అడిగినప్పుడల్లా నేను ఏమి చేస్తున్నానో ఏమి మాట్లాడుతున్నానో నాకే తెలియదు. నేను చదివినది కూడా మర్చిపోతాను. నాకు చేతి వేళ్ళు లేవని తెలిస్తే నాతో ప్రేమగా మాట్లాడేవారందరూ నాతో మాట్లాడరని నా భయం. తెలిస్తే అందరూ నన్ను ఎలా చూస్తారోనని భయం. దయచేసి నా సమస్యను పరిష్కరించగలరు?

నవీన్, గుంటూరు.

ఈ సమాజంలో ప్రతి మనిషికి ఏదో ఒక లోపం ఉంటుంది. అలా అని ఆ లోపం గురించి బాధపడుతూ కూర్చుంటే ఈ సమాజం ఇంతగా అభివృద్ధి చెందేదా! ఇక్కడ లోపం ముఖ్యం కాదు. మీ శక్తి మీకు ముఖ్యం. ఎవరో ఏదో అంటారని ఎంత కాలం మీ లోపం దాయగలరు! మీలోపం గురించి ఆలోచించడం మానేసి చదువు మీద దృష్టి పెట్టి చదువు. నీ శక్తిని ఉపయోగించుకొని మంచి మార్కులు సాధించు. అప్పుడు నీ లోపం గురించి కాక నీ టాలెంట్ గురించి మాట్లాడుకుంటారు. ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకో. దానిని సాధించే వరకు నీ దృష్టి నీ లక్ష్యం మీదే నిలుపు. ఎప్పుడైతే నీ లక్ష్యానికి చేరుకుంటావో అప్పుడు నీ లోపం నీకు చిన్నదిగా కనిపిస్తుంది.

సినిమా పిచ్చి



నేను ఆరవ తరగతి నుంచి ఇంటర్ వరకు హాస్టల్‌లో చదువుకున్నాను. ప్రస్తుతం బి.కామ్ సెకండ్ ఇయర్ చదువుతున్నాను. ఇప్పుడు అస్సలు చదవబుద్ధి కావడంలేదు. సమస్య ఏంటంటే నాకు సినిమా పిచ్చి ఎక్కువ. సినిమావాళ్ల గురించి బాగా ఆలోచిస్తాను. దర్శకుడు కావాలని, హీరో కావాలని, సినిమాలు తీయాలని, దేశాన్ని అభివృద్ధి పరచాలని పిచ్చి. అంతే కాదు పిచ్చిలేస్తుందేమోనన్న భయం కూడా నన్ను వెంటాడుతోంది. దయచేసి నా సమస్యకు పరిష్కారం తెలుపగలరు?

గిరి, నిజామాబాద్.

సినిమా దర్శకుడు కావటం, హీరో అవ్వడం మంచిదే. కాని నీవు సినిమా గురించి ఆలోచిస్తూ చదవకుండా సమయాన్ని వృథా చేస్తున్నావు. దాని వల్ల సినిమా దర్శకుడు కాదు కదా నీకు నువ్వు కూడా ఉపయోగపడవు. నీవు ముందు చదువు మీద దృష్టి పెట్టు. చదువుకుంటూనే దర్శకుడు, హీరో కావాలంటే ఏమి చెయ్యాలో తెలుసుకొని దానికి తగిన విధంగా ప్రయత్నం చెయ్యి. చదువుకుంటే మీరు అనుకున్న విధంగా మీ లక్ష్యాన్ని చేరుకోగలుగుతారు. ఈ రోజుల్లో చదువు లేకపోతే ఎవరూ పట్టించుకోరు. మూర్ఖంగా ఆలోచిస్తూ అనారోగ్యం పాలు కావద్దు. నీ ప్రయత్నాన్ని విరమించకుండా ప్రయత్నం చేస్తూనే ... నలుగురితో చక్కగా మాట్లాడటం అలవాటు చేసుకో! కొత్త కొత్త విషయాల పట్ల ఆసక్తిని పెంచుకో. కొత్త వ్యక్తులతో పరిచయాలు పెంచుకో. ప్రశాంతంగా ఉండటానికి సెల్ఫ్ హిప్నసిస్, యోగా, రిలాక్సేషన్ టెక్నిక్స్‌ని ప్రతి రోజూ ప్రాక్టీసు చెయ్యి.

మామిడి షర్బత్

కావలసిన పదార్థాలు

పచ్చి మామిడి రసం- 1 గ్లాసు, పంచదార- 3 గ్లాసులు, నీరు- అర గ్లాసు

తయారు చేసే విధానం

ముందుగా గట్టి పుల్ల మామిడి కాయలు తీసుకోవాలి. వాటిని ఎండు కొబ్బరి కోరుతో కోరాలి. ఒక స్పూను ఉప్పు వేసి పిసికి అరగంట తర్వాత ఒక గుడ్డలో వేసి రసం పిండాలి. అలా మొత్తం పిండుకోవాలి. అర గ్లాస్ నీళ్లలో పంచదార వేసి తీగ పాకం పట్టి రసం పోసి బాగా కలపాలి. ఐదు నిమిషాలు ఉంచి దించుకోవాలి. కావాలంటే రంగు ఎసెన్స్ వేసి కలుపుకోవచ్చు. ఇది బాగా చల్లారనిచ్చి పొడిగా వున్న సీసాలో పోసుకోవాలి. మనం తాగాలనుకున్నపుడు గ్లాసు చల్లటి నీళ్లలో రెండు స్పూన్ల రసం వేసుకొని కలుపుకొని తాగితే బాగుంటుంది.



పండు గుమ్మడి జామ్

పండు గుమ్మడి కాయను చెక్కు తీసి ముక్కలు చేసి కొద్దిగా నీరు పోసి మెత్తగా ఉడకపెట్టుకోవాలి. ఆ ముక్కలు గుజ్జులాగా పిసికి ఒక గ్లాసు గుజ్జుకి ఒకటిన్నర పంచదార వేసి స్టౌ మీద పెట్టి అడుగంటకుండా గట్టిపడే వరకు కలియబెట్టాలి. ఇప్పుడు స్టౌ మీద నుంచి దించి ఆరబెట్టుకొని తడి లేని సీసాలో భద్రపరచుకోవాలి.

రుచి

మామిడికాయ జామ్

పీచు లేని, పుల్లటి మామిడికాయలు తెచ్చుకోవాలి. చెక్కు తీసి సన్నగా ముక్కలు తరిగి కొంచెం నీళ్లు పోసి ఉడకపెట్టాలి. మెత్తగా ఉడకనిచ్చి గుడ్డతో వడకట్టాలి. గుజ్జు ఒకటి అయితే పంచదార ఒకటిన్నర పోసి, బాగా కలుపుతుండాలి. జామ్ అయ్యేదాక స్టౌ మీద ఉంచి ఉడకనిచ్చి దింపాలి. తర్వాత బాగా చల్లారనిచ్చి సీసాలో భద్రపర్చుకోవాలి.

జింజర్ షర్బత్

కావలసిన పదార్థాలు

అల్లం (జింజర్)- 300 గ్రాములు, పంచదార- కేజీ నిమ్మకాయలు-20

తయారు చేసే విధానం

ముందుగా నిమ్మకాయల్ని గింజలు లేకుండా రసం తీసుకోవాలి. అలాగే అల్లం కూడా దంచి రసం తీసుకోవాలి. ఇప్పుడు పంచదారలో తగినన్ని నీళ్లు పోసి తీగపాకం వచ్చే వరకు స్టౌ మీద పెట్టి ఉడికించుకోవాలి. ఇప్పుడు అల్లం రసం, నిమ్మరసం వేసి పాకం బాగా కలియబెట్టాలి. స్టౌ మీద నుంచి దించి చల్లారనిచ్చి సీసాలో పోసుకోవాలి. ఇష్టమైతే ఎసెన్స్ వేసుకోవచ్చు. ఇది గ్లాసు చల్లటి నీళ్లలో రెండు స్పూన్లు వేసుకొని కలుపుకొని తాగితే బాగుంటుంది.

గుర్తిస్తారా!

హాయ్ పిల్లలూ మీకందరికీ చెట్లంటే బోలెడంత ఇష్టమంట కదా. అలాగైతే మరి మీకు రకరకాల చెట్ల పేర్లు తెలిసి వుంటాయే. మరైతే ఇక్కడ కొన్ని చెట్ల పేర్లు ఆంగ్లంలో వున్నాయి. కాకపోతే అడ్డంగా, నిలువుగా, క్రాస్‌గా వున్నాయన్నమాట. మరి వాటిని గుర్తించి సున్నా చుట్టండే.

c	f	e	r	n	c
e	t	e	á	k	o
d	k	r	p	p	c
a	s	u	a	i	o
r	p	m	l	n	n
o	a	k	m	e	u
m	a	p	l	e	t

నిముషంలో చెయ్యగలరా?

లెక్కలంటే మీకు లెక్కేలేదంట! ఎంత కష్టమైన లెక్క ఇచ్చినా ఉఫ్ఫుమని ఊదేస్తారంట!! మీ గురించి అలా అలా తెలుస్తుంటాయిగానీ... ఇదిగో ఇవాళ మీ ముందున్న లెక్కల చదరాన్ని నిముషంలో పూరించండి చూద్దాం. వాచ్‌లో టైమ్ చూసుకుంటూ అంతా కరెక్ట్‌గా చేయాలి సుమా. చివరిగా మా సమాధానం చూడండే.

జవాబు: 9+3= 12, 12+4=16, 9+6= 15, 6-2= 4, 3-2= 1, 15+1=16.

9	+	3	=	
+	■	–	■	+
6	-		=	4
=	■	=	■	=
	+		=	16

ఐదు తేడాలు కనిపెట్టాలోచ్





పిడుగులూ! మీకు ఈ రెండు బొమ్మలూ ఒకేలా కనిపిస్తున్నాయా! అలాగైతే తప్పులో కాలేసినట్టే. ఎందుకంటే ఈ రెండు బొమ్మల్లో సరిగ్గా ఐదు తేడాలున్నాయి. మీరు వాటిని చిటికెలో కనిపెట్టాలోచ్. మరి ఆలస్యం ఎందుకంట!

రంగులు పులిమేద్దాం



చుక్కలు కలిపితే చక్కని బొమ్మ

ఈ చుక్కలను వరుసగా కలిపితే ఒక చక్కని సీతాకోకచిలుక మీ ముందు వుంటుంది. మరి ఇంకా ఎందుకంట అలా కూర్చుని చూస్తున్నారు? పెన్నో పెన్సిలో తీసుకొని కలిపెయ్యండీ.

చూసి గియ్యాలంతే

బొమ్మలు గియ్యడమంటే ఎవరికి ఇష్టముండదు చెప్పండి. అందులోనూ మీలాంటి చాకులకు మరీ ఇష్టం. మరైతే ఇదిగో ఇక్కడ పైగళ్లలో వున్న మిణుగురు పురుగు బొమ్మను చూసి కింది గళ్లల్లో గియ్యాలి. అంతే..





గమనిక: గతవారం 'నింపండి గబగబా'లో Balloon అని ఉండాలి. 'కవల విదూషకులెవరోచ్' సమాధానం: 1,4



ఎన్. నవీన్,
6వ తరగతి,
జడ్.పి.ఎస్.ఎస్.,
భట్టుపల్లి,
కాగజ్‌నగర్,
ఆదిలాబాద్.



ఎం. మధుకర్,
8వ తరగతి,
గురుకుల
పాఠశాల,
ఇబ్రహీంపట్నం.



సి.హెచ్. అలేఖ్య,
8వ తరగతి,
(హెచ్.పి.ఎస్.ఎస్)
స్కూల్, జులూరుపాడు,
ఖమ్మం.



సి.హెచ్. అజయ్ కుమార్,
9వ తరగతి,
మధు విద్యాలయం,
వైరా, ఖమ్మం.

అట్టమీది కథ

కె.అంజన

ముందు వేసవే పండు వెన్నెలగా...



వేసవి కాలం వచ్చేసింది. ఈ ఛాన్సు కోసమే ఎదురుచూస్తున్న భానుడు తన ప్రతాపాన్ని ప్రదర్శిస్తున్నాడు. మనమా! మానవ మాత్రులం. ప్రకృతి ప్రసాదించిన రుతువులన్నిటినీ సంతోషంగా ఆహ్వానించడం మినహా ఏం చేస్తాం? బుద్ధిజీవులం కాబట్టి మహా అయితే కాలానికి తగ్గట్టు మన అలవాట్లు..ఆహారం...ఆవాసం మార్చుకుంటాం. మలుచుకుంటాం. అంతేకదా. అప్పుడే మనం ఆరోగ్యంగా ఆనందంగా వుండగలం. ముందు వేసవిని సైతం ఆనందంగా ఆస్వాదించగలం.

"బాబోయ్! పది గంటల తర్వాత బయటకు వెళ్లాలంటేనే భయంగా వుంటోంది. కానీ కాసేపైనా లైబ్రరీకి వెళ్లకపోతే తోచదే...గొడుగు లేకపోతే ఇంకా ఏమైనా వుందా"

"అబ్బబ్బ...ఒకటే చెమటలు. ఉక్క ఈ సిల్కు గుడ్డలతో చికాగ్గా వుంటోంది. వేసవి మూడు నెలలు ఎలా గడుస్తాయో ఏంటో..."

"పిల్లకుంకలు ఊరకే నీళ్లు తాగుతున్నారు. అన్నం దగ్గరకొచ్చేసరికి రెండు ముద్దలు కూడా తినట్లేదు. పాడైపోతున్నారు. వీళ్లతో తిండి తినిపించేసరికి నా ప్రాణం పోతోంది"

"చీటికీ మాటికీ ఎండలోకి వెళ్లి ఆడతామంటారు. ఎండలు మామూలుగా వున్నాయా? చెప్తే అర్థంకాదు. పెద్దమొనగాళ్లలాగా బయటకు వెళ్తామంటారు. వాళ్లకి కాపలా కాయడం నావల్ల కావడంలేదు"

ఈ రోజుల్లో ఏ ఇంట్లో చూసినా ఇలాంటి సంభాషణలే జరుగుతుంటాయి. మరి వేసవి కాలమా! మజాకానా!! ఆ మాత్రం భయం వుంటుందికదా. అలా అని ఊరుకుంటామా మనం. తెలివిగా ఆలోచిస్తాం. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటూ వేసవికాలాన్ని జామ్‌జామ్ అని గడిపేస్తాం. మరి ఆ జాగ్రత్తలేంటో చూద్దామా!

ఇంట్లో ఇలా...

ఇంటికి తెలుపు, లేత పసుపు, లేత గులాబీ రంగు సున్నం వేసుకుంటే మనసుకు హాయిగా వుంటుంది. పైగా ఎండప్రభావం కూడా అంతగా వుండదు. ❖ రేకుల ఇంటికి థర్మాకోల్ సీలింగ్ వేయిస్తే...చాలా వరకు వేడిని అరికడుతుంది.❖ కిటికీలు, వాకిళ్లు తెరిచి వుంచాలి. మిగతా సీజన్లలో వాడే నైలాన్ కర్టెన్లను తీసేయాలి. వాటికి లేత రంగు కాటన్ కర్టెన్లు కట్టాలి. గాలి హాయిగా తగులుతుంది.❖ ఆర్థిక స్థోమతు వుంటే కిటికీల దగ్గర వేళ్ల చాపలు కట్టి...అప్పుడప్పుడు నీళ్లు చల్లుకుంటే ఇల్లంతా చల్లగా ప్రశాంతంగా వుంటుంది. ❖ టేబుల్ ఫ్యాన్ కన్నా సీలింగ్ ఫ్యాన్ మంచిది. గదంతా చల్లబడుతుంది.❖ మధ్యాహ్నం వంట చేస్తే...ఆ వేడి ప్రభావం అన్ని గదుల్లో వుంటుంది. సాధ్యమైనంత వరకు ఎండ తీవ్రత పెరగక ముందే వంట పూర్తిచేసుకోవాలి. ❖ఇంటి చుట్టూ మొక్కలు వుంటే... చల్లగా వుంటుంది. ఒకవేళ స్థలం లేకపోతే కనీసం కుండీల్లోనైనా మొక్కలు పెట్టుకుంటే మంచిది. హాల్లో...బెడ్‌రూమ్‌లో కూడా కుండీలు పెట్టి పొద్దున, సాయంత్రం నీళ్లు చల్లుతూ ఉంటే చల్లటి వాతావరణం కనిపిస్తుంది. రోజుకి రెండు మూడుసార్లు ఇల్లు తుడిస్తే కూడా చల్లగా వుంటుంది. తలుపులు, కిటికీలు తెరిచినందువల్ల వచ్చే దుమ్ము కూడా పోతుంది.

మరి బట్టల సంగతో!

కాటన్ బట్టలు వేసుకుంటే చాలా హాయిగా వుంటుంది. అవీ లేత రంగులవి వేసుకుంటే మరీ మంచిది. ఎండలో బయటికెళ్లినా అంత ఇబ్బంది వుండదు. నలుపు రంగు బట్టలు అస్సలు వేసుకోకూడదు. ఎందుకంటే నలుపుకు ఉష్ణాన్ని గ్రహించే లక్షణం వుంటుంది. అది మనమీద ప్రభావం చూపిస్తుంది. ❖ మగవాళ్లు కాటన్ చొక్కాలు అదీ అరచేతుల చొక్కాలు వేసుకుంటే మంచిది. ఇది కుదరకపోతే కనీసం టీషర్టులు వేసుకున్నా పరవాలేదు.❖ బిగుతుగా వుండే బట్టలకంటే లూజుగా వుండే కాటన్ బట్టలు వేసుకోవడం మంచిది.❖ రాత్రుళ్లు వేసుకునే బట్టలు కూడా కాటన్‌వైతేనే బావుంటాయి. ఆరోగ్యం కూడా.❖ కప్పుకునే దుప్పట్లు, తుడుచుకునే కండువాల సంగతి ప్రత్యేకంగా చెప్పేదేముంది! అవీ కాటన్‌వే. ఈ వేసవి వెళ్లిపోయే వరకు మన ఓటు కాటన్ బట్టలకే వేయాలని మర్చిపోకండి.

ఏం తినాలి?

వేసవిలో తొందరగా ఏదీ తినాలనిపించదు. ఆకలి తక్కువగా వుంటుంది. మరీ ముఖ్యంగా నూనె పదార్థాలను చూస్తుంటేనే వెగటుగా అనిపిస్తుంది. మరి ఆహారం సరిగ్గా తీసుకోకపోతే నీరసంగా వుంటుంది. అందుకని ...

త్వరగా జీర్ణం అయ్యేవి, పీచు పదార్థం వున్న కూరలు తినాలి. ఆకుకూరలు మంచిది. ❖ నాన్‌వెజ్, నూనె వస్తువులు, వేపుళ్లు తగ్గించాలి. ❖ ఉదయం, సాయంత్రం పెందలాడే భోజనం చేయాలి. ❖ పెద్దమొత్తంలో ఆహారాన్ని ఒకేసారి తీసుకునేకంటే కొద్దికొద్దిగా నాలుగైదుసార్లుగా తినాలి. ❖ ఎంత వేసవికాలమైనా ఆహారపదార్థాలు చల్లగా ఆరిపోయాక తినకూడదు. అలాగని మరీ వేడి పదార్థాలనూ తినకూడదు. కాస్త వేడి తగ్గాక తినాలి. ❖ ఉప్పు, మసాలాలు అధికంగా వున్న పదార్థాలను దూరంగా వుంచడమే మంచిది. ❖ ఇక పళ్ల సంగతి చూద్దాం. ఘన పదార్థాలను చూసి పెదవి విరిచేవారు కూడా కాస్త పళ్లు తినడానికి ఆసక్తి చూపిస్తుంటారు. పుచ్చకాయలు, ద్రాక్ష, కమలా, సపోటా, బొప్పాయి, అరటిపండు వంటివి ఎక్కువగా తీసుకోవచ్చు. వేసవిలో లభించే పళ్లు కావడంతో ఇవి కాస్త చవకగా కూడా వుంటాయి. ముఖ్యంగా పుచ్చకాయ ముక్కలు చూడ్డానికి ఎర్రగా నోరూరిస్తూ వుంటాయి. గ్రీష్మతాపాన్ని తట్టుకోవడానికి ఎక్కువ ఇష్టంగా తింటుంటారు. ఇందులో ఎక్కువశాతం వుండేది నీళ్లే. అందుకే వెంటనే మనకు దాహం తీరుతుంది.

ద్రవపదార్థాల మాటేంటి!

ఎండ వేడికి చల్లగా గొంతులో జారిపోయేట్టు ఏవైనా తాగితే బాగుందనిపిస్తుంది. పిల్లల దగ్గరనుంచి పెద్దల వరకు అందరూ ద్రవ పదార్థాలవైపే మొగ్గు చూపిస్తారు. అందుకే....

ఎండలోంచి ఇంటికి రాగానే నీళ్లు తాగాలనిపిస్తుంది. అయినా వెంటనే తాగకూడదు. ముఖ్యంగా ఫ్రిజ్‌లోని నీళ్లు అసలు తాగకూడదు. కాసేపు రిలాక్స్ అయ్యాక ... హాయిగా కుండనీళ్లు తాగితే ఆరోగ్యం. అలాగే కాఫీ, టీలు తగ్గించాలి. ❖ బార్లీ నీళ్లు , రాగి జావ, మజ్జిగ తీసుకుంటే నయం. ❖ తాజా పళ్ల రసాలు తాగితే ఆరోగ్యం. ❖ వేసవి తాపం భరించలేక చల్లగా వుంటాయని గబుక్కున కూల్ డ్రింకులు కొని తాగేస్తుంటాం. కానీ కొబ్బరినీళ్లు తాగడం నూటికి వంద శాతం ఆరోగ్యం. ఎండలో బయటినుంచి వచ్చిన తర్వాత లేత కొబ్బరి నీళ్లల్లో కొద్దిగా గ్లూకోజ్ కలుపుకొని తాగితే ప్రాణం లేచివచ్చినట్టుంటుంది. ❖ చెరకు రసం బాగా అందుబాటులో వుంటుంది. ఐస్ లేకుండా తాగితే సరి. ❖ రాత్రిపూట నీళ్లలో ఎండుకర్జూరం నానబెట్టి ఉదయాన్నే తాగొచ్చు. ❖ నిమ్మకాయలు బాగా అందుబాటులో వుంటాయి కాబట్టి నిమ్మరసం తాగొచ్చు. పొద్దున్నే ఒక గ్లాసు నీళ్లల్లో నిమ్మకాయ రసం, తేనె కలుపుకుని తాగితే మంచిది. ❖ నిమ్మ షర్బత్ చేసి వుంచుకుంటే ఇంటికి ఎవరైనా వస్తే కూల్ డ్రింకో, కాఫీనో ఇవ్వకుండా ఎంచక్కా చల్లటి నిమ్మరసం ఇవ్వొచ్చు. ఇవేకాకుండా క్యారెట్ జ్యూస్ కూడా తీసుకోవచ్చు. ఇక చూసుకోండి... నీరసం, తల తిరుగుడు, బద్ధకం వంటివన్నీ 'హుష్! కాకి' అన్నట్టు ఎగిరిపోతాయి.

నీళ్లు...నియమాలు...

వేసవిలో శరీరానికి నీళ్లు చాలా అవసరం. చెమట రూపంలో ఎక్కువగా నీరు బయటికి వెళ్లిపోతుందికదా. అందుకని ఆ కొరతను భర్తీ చేయడానికి సరిపడా నీళ్లు మనం మళ్లీ తీసుకొంటుండాలి. మన శరీర ఉష్ణోగ్రత సక్రమంగా వుండడానికీ కూడా నీళ్లు ఎంతగానో సహకరిస్తాయి . సరిపడా నీళ్లు తాగకపోతే.... డీహైడ్రేషన్ వస్తుంది. అంటే శరీరంలో నీటిశాతం తగ్గిపోయి సమస్యలు వస్తాయి. రోజుకు ఎనిమిది లీటర్లకు పైగా నీళ్లు తాగొచ్చు. చల్లచల్లగా కుండలో నీళ్లు తాగుతుండాలి.

ఎండ ...ఎండ... ఏంచేయాలి?

ఎంత ఎండగా వున్నా బయటకు వెళ్లకా తప్పదు. రోజువారీ పనులు చేసుకోకా తప్పదు. మరి అలాంటప్పుడు గొడుగు వాడడమో, చలవకళ్లద్దాలు పెట్టుకోవడమో చేయాలి. ఒకవేళ గొడుగు వేసుకోవడం నామోషీ అనుకుంటే నెత్తిమీద కౌబాయ్ టోపీ పెట్టుకుంటే సరి. ఎండ నుంచి రక్షణగా వుంటుంది. స్టైల్‌గా కూడా వుంటుంది.

చర్మాన్ని కాపాడుకోవడం ఎలా?

ఇందాక చెప్పుకున్నట్టు బయటకు వెళ్లేప్పుడు గొడుగు వేసుకెళ్లడంతోపాటు ...ఇంట్లో కూడా కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవాలి. కీరా, దోసకాయ ముక్కలు కోసి మొహానికి పెట్టుకొని కాసేపు వుంచుకోవాలి. తర్వాత చల్లటి నీళ్లతో స్నానం చేస్తే సరి. రోజంతా ఫ్రెష్ గా అనిపిస్తుంది. బయటకెళ్లే ముందు సన్‌స్క్రీన్ లోషన్ రాసుకోవాలి. బయటినుంచి రాగానే చల్లటి నీళ్లతో మొహం కడుక్కోవాలి.రోజుకి రెండు సార్లు ... ఉదయం, సాయంత్రం... స్నానం చేయాలి. అదీ బాగా వేడినీళ్లతో కాదండోయ్. అలాగని చల్లటి నీళ్లతోనూ కాదు. గోరువెచ్చటి నీళ్లతో స్నానం చేస్తే హాయిగా వుంటుంది. రాత్రుళ్లు చక్కగా నిద్రకూడా పడుతుంది. అదే సాయంత్రాలు స్నానం చేయకపోతే పొద్దుటి నుంచి వంటికి పట్టిన జిడ్డు, చెమటతో సరిగా నిద్రే పట్టదు. సబ్బుతో కాకుండా సున్నిపిండితో స్నానం చేస్తే... మరింత మంచిది. స్నానం అయ్యాక కాటన్ టవల్‌తో తడి లేకుండా శుభ్రంగా తుడుచుకొని కాటన్ బట్టలు వేసుకోవాలి. అదే బాగా వేడినీళ్లతో చేస్తే స్నానం అయిన వెంటనే విపరీతంగా చెమటలు పోసేస్తాయి. చెమట వెంటే దుర్గంధం... ఇక స్నానం చేసిన ప్రయోజనం నెరవేరదు.

వెంట్రుకల సంగతో...

వేసవికాలం బయటికెళితే మొట్టమొదట ఎండ సోకేది మన చర్మానికీ...వెంట్రుకలకే. ఈదురుగాలుల మూలంగా వచ్చే దుమ్ముకు గురయ్యేది కూడా అవే. అందుకే వాటి పట్ల శ్రద్ధ తీసుకోవడం చాలా అవసరం. ఆరోగ్యం కూడా. ముందర అను కున్నట్టు ఎండ

ప్రయాణం చేయాలనుకుంటే...

ఆ... స్కూళ్లయ్యాక... మళ్లీ సమ్మర్ క్యాంపుల్లో కుక్కడమేంటి? నాలుగు రోజులు అలా సరదాగా బంధువుల ఇళ్లకో, స్నేహితుల ఇళ్లకో తీసుకెళితే నయం కదా అనుకుంటారు కొందరు. అదీ మంచిదే. ఎంచక్కా కుటుంబం అంతా రిఫ్రెష్ అయి రావచ్చు. అయితే ఆ విషయం లోనూ కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రయాణం పగలు చేయకూడదు. రాత్రుళ్లయితే పిల్లలకూ చల్లగా బావుంటుంది. రిజర్వేషన్ చేయించుకొని వెళ్లడం మంచిది. ప్రయాణంలో నూనె వస్తువులను దూరంగా వుంచడమే మంచిది. వీలైనంత తక్కువ లగేజీ తీసుకెళితే నయం. బంధువుల ఇళ్లకు వెళ్లినప్పుడు నేస్తాలతో కలిసి ఈత కొట్టడానికి వెళుతుంటారు పిల్లలు. ఈ విషయంలో పెద్దలు చాలా జాగ్రత్తగా వుండాలి. పెద్దల పర్యవేక్షణలోనే వారికి ఈత నేర్పించాలి. ముఖ్యంగా స్థానికంగా చెరువుల లోతుపాతులు తెల్సిన వారు వుంటేనే ఈతకు వెళ్లనివ్వాలి. ఎందుకంటే.. ఏ చెరువులో ఎక్కడ లోతుగా వుంటుందో స్థానికులకే బాగా తెలుస్తుంది. రిటన్ ప్రయాణంలోనూ పై జాగ్రత్తలు పాటిస్తే సరి.



చిన్నారులకు చిట్కాలు

వేసవి వచ్చిందంటే చాలు పిల్లలను పట్టుకోవడం కష్టంగా వుంటుంది. స్కూళ్లు వుండవు. రోజంతా ఖాళీగా వుండడంతో వాళ్లకీ తోచుబాటుగాక బయటికీ లోపలికీ తిరుగుతూ గంతులు వేస్తుంటారు. ఎంత చెప్పినా ఎండలో ఆడుతుంటారు. సరిగ్గా తిండి తినరు. మరి అలాంటి పిడుగుల విషయంలో కొద్దిపాటి జాగ్రత్తలు తీసు కోవడం అవసరం కదా. అందుకే...

పిల్లలకు రెండు పూటలా స్నానం చేయించాలి. ఎంచక్కా కాటన్ బట్టలు లైట్ కలర్‌వి వేయాలి. నూనె పదార్థాలు పెట్టకూడదు. ఎక్కువగా ద్రవపదార్థాలు ఇస్తే ఇష్టంగా తాగుతారు. ❖ కూరలు కూడా పప్పుచారు, రసం, పులుసులు కాస్త ఇష్టంగా తింటారు. పళ్లు ఎక్కువగా పెట్టాలి. పెరుగన్నం, మజ్జిగ తాగించడం చేయాలి.❖ఇంటి లోపల ఆడే ఆటలు ప్రోత్సహించడం మంచిది. అందుకు కావలసిన ఆట వస్తువులను కొనివ్వ వలసిన బాధ్యత పెద్దలదే. ❖ ఉదయం, సాయంత్రాలలో మాత్రం వాళ్లను బయట ఆడు కోనివ్వవచ్చు.❖ మాంచి ఎండలో పిల్లలను బయటకు పోనివ్వకూడదు. పెద్దలూ తీసుకెళ్లకూడదు.❖ఫ్రిజ్‌లో నీళ్లు అదేపనిగా తాగనివ్వకూడదు. కుండలో నీళ్లు తాగే అలవాటు చేయాలి.❖ మొత్తం మీద వారు ఇష్టంగా తినే బలవర్థక ఆహారాన్ని అందించాలి. అసలు విషయం మర్చేపోయాం. ఆటలు ఆడీఆడీ మురికి పట్టిన చేతులతోనే తినడానికి ప్రయత్ని స్తారు చిన్నారులు. చేతులు శుభ్రం గా కడిగించాకే తినేలా చూడాలి.❖ సెలవుల్లో పిల్లలు సైకిల్ నేర్చుకోవాలని ఉబలాటపడు తుంటారు. అయితే ఎండలో మాత్రం ఇందుకు అనుమతించకూడదు. అదే విధంగా పిల్లల బరువు, ఎత్తుకు సరిపడా సైకిల్‌ను మాత్రమే వారికి ఎంపిక చేయాలి. వారి సైజుకు మించిన సైకిల్‌ను ఇవ్వడం వల్ల వారికి భారంగా తయారౌతుంది. మీదేసుకోవడం, పడేయడం చేస్తుంటారు. దానివల్ల లేనిపోని దెబ్బలు తగులుతుంటాయి. గాయాలైనప్పుడు మరీ పెద్దవైతే వెంటనే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లాలి. చిన్నగాయాలకు చికిత్స చేయడానికి వీలుగా ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌ను ఇంట్లో వుంచుకోవాలి. ❖ అదే సమయంలో పెద్దలు పిల్లల వెంట వుండి నేర్పిం చడం మంచిది. సైకిల్ తొక్కడంలో మెళకువలు చెప్పడం తోపాటు రోడ్ రూల్సుకూడా చెప్పేందుకు అదే సదవకాశం.❖ మొదట ట్రాఫిక్ ఎక్కువగా లేని ప్రదేశాల్లో నేర్పిం చడం ఉత్తమం.❖ సైకిల్ నేర్చు కోవడానికి రాత్రుళ్లు వెళ్లనివ్వ కూడదు.❖అలాగే సైకిల్ బ్రేకులు, చక్రాల్లో గాలి సక్రమంగా వున్నాయో లేవో చూసుకోవడం కూడా నేర్పాలి. సైకిల్‌ను శుభ్రంగా తుడుచుకోవడం కూడా నేర్పించాలి. ❖అదే స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొట్టేవారైతే ముందర షవర్ కింద తప్పనిసరిగా తల తడుపుకోవాలి. ఎందుకంటే పూల్‌లో క్లోరిన్ వాటర్ సరాసరి వెంట్రుకలకు తగలడం వల్ల జుట్టు నిర్జీవంగా తయారౌతుంది. ఈ విషయాన్ని పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాల్సింది పెద్దలే. ❖ ఉద్యోగస్థులకు మరో సమస్య వుం టుంది. అమ్మానాన్నలిద్దరూ ఉద్యోగాలకు వెళితే వేసవిలో పిల్లలు వంటరిగా ఇంట్లో వుంటారు. అప్పుడు తీసుకోవలసిన జాగ్ర త్తలు కూడా వారికి విపులంగా చెప్పాలి. ఎవరైనా కాలింగ్ బెల్ కొడితే వెంటనే తలుపు తీసేయకుండా సేఫ్టీ హోల్ లోంచి ఎవరు వచ్చిందీ చూడమని చెప్పాలి. అపరిచితులైతే కిటికీ తీసి సమాధానం చెప్పి పంపేయమనాలి. అలాగే అమ్మా నాన్నలు, బంధువుల ఫోన్ నెంబర్లు వారికి కంఠతా వచ్చేలా చూడాలి. అవసరమైతే కాల్ చేయమని చెప్పాలి. గ్యాస్ స్టవ్ రెగ్యులేటర్ దగ్గర ఆఫ్ చేసి వెళ్లడం ఉత్తమం.

❋

పడకుండా గొడుగో, టోపీనో వాడాలి. ఇంకా వారానికి రెండు సార్లు తల స్నానం చేయాలి. తల మీద పేరుకున్న దుమ్ము, ధూళి , చెమట పోతుంది. మహిళలైతే చిట్లిపోయి, నిర్జీవంగా తయారైన తల వెంట్రుకల చివళ్లను... ప్రతి ఆరు వారాలకొకసారి అర అంగుళం పాటు కత్తిరించవచ్చు.

పరిసరాల శుభ్రత

చల్లగా వుంటుందికదా అని ఇంటి చుట్టూ నీళ్లు నిల్వ వుండనివ్వకూడదు. దోమలు చేరే ప్రమాదం వుంది. కూలర్లు, వాటర్ ట్యాంకులలో నీళ్లు క్రమం తప్పకుండా మారుస్తుండాలి. కొబ్బరిబొండాలను ఇంట్లో అట్టిపెట్టుకోకూడదు. అందులోకి దోమలు చేరి వృద్ధి చెందుతాయి. చెత్తకుప్పలు కూడా పేరుకుపోకుండా చూడాలి. అప్పుడే దోమకాటు వల్ల వచ్చే రోగాలనుంచి రక్షణ పొందుతాం.

వేసవి-వ్యాయామం

వేసవి కాలం కాస్త మత్తుగా అనిపిస్తుంది. ఉదయాన్నే లేవబుద్ధి కాదు. వ్యాయామం అంటే బద్ధకంగా వుంటుంది. అలా అని వ్యాయామం చేయడం మానేయనవసరం లేదు. ఎప్పటిలాగే కొనసాగించవచ్చు. అయితే ఎండ వేళల్లో కాకుండా ఉదయాన్నే చేయడం మంచిది. ముఖ్యంగా హెవీ ఎక్సర్‌సైజులు చేయకుండా వాకింగ్ చేయడం శరీరానికి మంచిది. అయితే వ్యాయామం చేసేటప్పుడు కూడా కాటన్ బట్టలే వేసుకోవాలి. స్విమ్మింగ్ కూడా మంచి వ్యాయామమే.

వడదెబ్బ కొడితే...

మాంచి ఎండలో తిరిగితే వడదెబ్బ కొడుతుంది. అప్పుడు అకస్మాత్తుగా శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. చర్మం పొడిబారినట్టు అవుతుంది. మత్తుగా అనిపిస్తుంది. మన చుట్టూ ఏం జరుగుతుందో తెలియదు. అప్పుడు శరీరాన్ని చల్లటి నీళ్లతో తుడవాలి. సదరు వ్యక్తులు ఏమాత్రం స్పృహలో వున్నా చన్నీటితో స్నానం చేయించాలి. వెంటనే వైద్యసహాయం తీసుకోవాలి.



ఎలాంటి 'సమ్మర్ క్యాంప్' మంచిది?

ముందుగా మీ పిల్లల ఇష్టాయిష్టాలేంటో తెలుసుకోండి. అవసరమైతే అడగండి. వారు ఏం నేర్చుకోవడానికి ఇష్టపడుతున్నారో... తెలుసుకోండి. ఉదాహరణకు పిల్లలకు క్రాఫ్ట్స్ చేయడం ఇష్టం. డ్రాయింగ్ వేయడంలో ఆసక్తి వుంది. సైన్స్ ప్రయోగాలు చేయడంలో ఇంట్రస్ట్ చూయిస్తున్నారు. అందుకు అనువైన సమ్మర్ క్యాంపులు ఏమైనా వున్నాయేమో తెలుసుకోండి. అలాగే మీ ఇరుగు పొరుగు వారిని కూడా ఈ విషయాల్లో కదిపి చూడండి. వారూ తమ అనుభవాలు చెప్తారు. అప్పుడు మంచి నిర్ణయం తీసుకునే చాన్స్ మనకు దొరుకుతుంది. అలాగే పిల్లలు అక్కడ సేఫ్టీగా వుంటారా లేదా? అన్న విషయాన్ని ముందుగా పెద్దలే అంచనా వేసుకోవాలి. వారికి ఇంటి ఫోన్ నెంబర్ నోటికి వచ్చేలా చూడాలి. మరీ అంత చిన్న పిల్లలైతే సమ్మర్ క్యాంప్ నుంచి పెద్దవాళ్లే తీసుకురావడం మంచిది. పట్నాల్లో ఎండకు దడిసి నాలుగు గోడల మధ్యే వుంచేకంటే ...ఇలా చేయడం వల్ల వారికి ఇదో ఆటవిడుపుగా వుంటుంది.

ఊళ్లకు వెళ్లకుండా ఇంట్లోనే వుంటే...

పిల్లలను లైబ్రెరీకి పంపించాలి. కథలు, కవితలు, కామిక్స్ చదువుకునేలా ప్రోత్సహించాలి. పజిల్ పుస్తకాలు కొనిచ్చి పూరించమనాలి. కంప్యూటర్ వుంటే ఫోటోషాప్, డిటిపి నేర్చుకోమని చెప్పాలి. షోటోషాప్‌లో ప్రయోగాలు చేసేలా ప్రోత్సహించాలి. పెరట్లో మొక్కలు నాటటం వాటి బాగోగులు చూసుకోవడం నేర్పించవచ్చు. ఏదైనా కొత్త భాష నేర్చుకునేందుకు అవసరమైన పుస్తకాలు, క్యాసెట్లు ఇస్తే... పిడుగులు రెచ్చిపోరూ.

ఇలా చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే... మండు వేసవికూడా ... పండు వెన్నెలే అవుతుంది కదూ.

❋

ఎవరి పేర్లు వుండాలి?

మేమిద్దరం అన్నాచెల్లెళ్లం (ఎస్టీ). మొదటి నుంచీ మా ఇద్దరిదీ ఒకే క్లాసు. చిన్నప్పుడే మమ్మల్ని (ఎస్టీలకే) సాంప్రదాయ దత్తత ఇచ్చారు. అయితే 10వ తరగతి సర్టిఫికెట్లు, టీసీలలో అసలు తల్లిదండ్రుల పేర్లు... ప్రస్తుతం ఇంటర్ చదువుతున్న కాలేజీ రికార్డులలో దత్తత తల్లిదండ్రుల పేర్లు వున్నాయి. అయితే ఒక విషయం చెప్పాలి. అసలు పేరెంట్స్ పేరున పొందిన కులధృవీకరణ పత్రాలు, దత్తత తల్లిదండ్రుల పేరున పొందిన కుల ధృవీకరణ పత్రాలు వున్నవి. రేపేదైనా ట్రయినింగ్‌కు గాని, పై చదువులకు గాని వెళితే వచ్చే అభ్యంతరాలకు నివారణెలా? అప్పుడు రెండూ చూపెట్టాలా? ఖచ్చితంగా టీసీలలో, పాస్ సర్టిఫికెట్లలో తల్లిదండ్రుల పేర్లు మార్చకపోతే అభ్యంతరాలు వస్తాయా? ఫైనల్‌గా రేపు ఎంసెట్ మొదలగు వాటిలో అభ్యంతరాలు రాకుండా, ఇప్పటి నుండే ఏం చెయ్యాలి. నోటరీ చేయించాలా? అంతా అయోమయంగా ఉంది.

ఎం. బాబు, ఎంహెచ్.ఎస్ మిత్ర,
శ్రీరాంనగర్, విజయనగరం జిల్లా.

ఎస్ఎస్‌సి సర్టిఫికెట్లలో తల్లిదండ్రుల పేర్లు, ప్రస్తుతం చదువుతున్న కాలేజీ వివరాలలో తల్లిదండ్రుల పేర్లు వేరేగా వున్నాయి. కావున, రేపు ఉద్యోగాన్వేషణలో అలా ఏమైనా అడ్డంకులు రావచ్చు. మీ దత్తత రిజిస్ట్రేషన్ అయింది. కావున ఆ దత్తత రిజిస్ట్రేషన్ పత్రం ద్వారా మీరు కోర్టులో సివిల్ దావా వేసి ఎస్ఎస్‌సి బోర్డు వారిని ప్రతివాదులుగా చేసి దావా చేసుకొంటూ కోర్టు డిక్రీ పొందవచ్చు.

పౌరులు కోరితే సిబిఐ విచారణ చేయదా?

నాన్ పోలీస్ ఎంక్వయిరీ, సిబిసిఐడి విజిలెన్సు మొదలగు విచారణలు కోరే హక్కు సాధారణ పౌరులకు లేదా? నేరుగా, సాధారణ పౌరుడు చేసే ఫిర్యాదును ఈ విచారణ సంస్థలు స్వీకరించవా? ఎందుకంటే దేశంలో, ఎవరికి ఫిర్యాదు చేసినా... వారందరూ ఫైనల్‌గా పోలీసు ఎంక్వయిరీ మీదనే ఆధారపడి, నిర్ణయం తీసుకొంటున్నారు. పౌరుల ప్రాణాలతో చెలగాటం ఆడటం జరుగుతున్నది. పలుకుబడి, డబ్బు ఉన్న వాళ్ళు ఈజీగా వారికి అనుకూలంగా మార్చుకుంటున్నారు. నాన్ పోలీస్ ఫిర్యాదు (ఎంక్వయిరీ) సాధనాలేమిటి? అన్యాయాలకు గురయిన ఎస్సీ, ఎస్టీ వారు ఖచ్చితంగా, న్యాయం పొందడానికి బహిరంగ లేదా రహస్య విచారణ, నాన్ - పోలీస్ విధానాలేమిటి? పూర్తిగా చెప్పండి.

ఎం. పార్వతీ రాజా, శ్రీకాకుళం జిల్లా.

పోలీస్ సంస్థలు కాకుండా ఇంకా ఎటువంటి సంస్థలు, ఇన్వెస్టిగేషన్ చేయజాలవు. సిబిఐ లాంటి వారు రావాలంటే, ఎంతో ప్రాధాన్యత ఉన్న కేసుల్లో మాత్రమే వారు విచారణ చేస్తారు. సామాన్యమైనవి, పూర్తిగా వ్యక్తిగతం అయిన కేసులను వారు పరిష్కరించ జాలరు. ఎస్సీ, ఎస్టీ వారు వేరే కులస్థుల ద్వారా అన్యాయానికి గురవుతుంటే కమిషన్ వారిని సంప్రదించవచ్చును. ఇంతకన్నా ప్రత్యామ్నాయం ఏమీలేదు. ప్రయివేటు ఏజెన్సీలు ఉన్నా అవి చాలా ఖర్చుతో కూడుకున్నవి. అవి అందరికి అందుబాటులో కూడా లేవు.

పాఠకులకు మనవి

మీకు లేదా మీవాళ్ళకు న్యాయ సంబంధమైన ఇబ్బందులేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజే యండి. న్యాయవాది శ్రీ జి.ఎల్.నరసింహా రావు తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా: ప్రజాశక్తి, ఆదివారం అనుబంధం, స్ట్రీట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

జి. ఎల్. నరసింహారావు
హైకోర్టు న్యాయవాది,
9848994240





కథ

మంతెన సూర్యనారాయణరాజు

నిరుద్యోగ పర్వంలో...

ఆదరాబాదరా వచ్చిన జోగులయ్యను చూసి ఛైర్మన్ "జోగులయ్యా! ఆ మేష్టర్ పోస్టు పాతికవేలు తక్కువైతే మాత్రం అమ్మకు" అంటూ హుకుం జారీ చేశాడు.

"అది కాదు బాబయ్యా! మరీ అంత రేటెక్కువైతే గొడవొచ్చేత్తదండీ!! తవురి అపోజిషనోళ్ళు ఇదంతా బైటికి లాగి టాంటాం జేత్తారండి. కాబట్టి తవురు మరీ కరాకండీగా రేటు పెడితే సానా సిక్కులొచ్చి పడతాయండి" అన్నాడు జోగులయ్య.

"సరే! అఘోరించు, కనీసం ఇరవైకి తగ్గనివ్వకు. పోయేముందీ సొమ్మైనా దక్కుతుంది. అట్టే పాట పెరగలేదనుకో ఏదో వంకబెట్టి ఆ పోస్టు ఆపేద్దాం! మిగిలినవి కానివ్వచ్చు" అన్నాడు చుట్ట వెలిగిస్తూ.

"అంకమ్మ తోట మునిసిపల్ స్కూల్లో అటెండర్ పోస్టు దేవుడిపాట వెయ్యి రూపాయలు. వెయ్యి రూపాయలు"

వెంటనే ఒకాయన గంభీరంగా "రెండు వేలు" అన్నాడు.

"రెండు వేలు. మన బీడీ కొట్టు బసవయ్య గారి బామ్మర్ది పాట రెండు వేలు. ఒకటోసారి... రెండోసారి..."

"అయిదు వేలు" అంటూ వత్తి పలికిందో గొంతు.

"వెంకటాచలంగారి పాట ఐదు వేల రూపాయలు. ఐదువేల రూపాయలు"

"ఏడు వేలు" అంటూ ఘీంకరించింది మరో గొంతు.

"భూషణ్‌రావు గారి పాట ఏడు వేల రూపాయలు. ఒకటోసారి... ఒకటోసారి... ఏడువేల రూపాయలు. కొట్టేస్తున్నాను. మూడోసారి" అనేశాడు డపేదారు జోగులయ్య.

అలిసిపోయినట్టుగా మునిసిపల్ కమిషనర్ గదిలోకెళ్ళి మంచినీళ్ళు తాగి సిగరెట్ కాల్చుకుని తిరిగొచ్చి కమిషనర్ చెప్పిన సూచన మనస్సులో వుంచుకుని మళ్ళీ వేలంపాట కొనసాగించడానికి పూనుకున్నాడు. గొంతు సరిజేసుకుంటున్నట్లు సకిలించి

"చుక్క రాజుపేటలో మునిసిపల్ స్కూల్లో గ్రేడు 2 తెలుగు పండిట్ పోస్టు దేవుడిపాట ఐదువేల రూపాయలు..." అన్నాడు జోగులయ్య.

"కుదరదు. దేవుడి పాటంటే వెయ్యి రూపాయల దగ్గర్నుంచే మొదలెట్టాలి" అంటూ తమ తమ తాలూకు వ్యక్తులకోసం పోస్టులు పాడటానికొచ్చిన జనం గలాభా చేశారు. మిగతా వాళ్ళు కూడా కలుగజేసుకుంటున్నట్లుగా "అవును వెయ్యి రూపాయల్తోటే మొదలెట్టాలి" అంటూ ముందు గొంతులకు వంత పలికారు.

డపేదారు జోగులయ్య యజ్ఞోపవీతం లాంటి బెల్టును ఒక్కసారి చక్కదిద్దుకుని కమిషనర్ వైపు చూశాడు. అతగాడు అలాగే కానిమ్మన్నట్లు సైగ చెయ్యడంతో "ఈసారి మళ్ళీ మొదలెడుతున్నాం! చుక్కరాజు పేటలో ఉన్న మునిసిపల్ స్కూల్లో గ్రేడు 2 తెలుగు పండిట్ పోస్టు కమిషనర్‌గారు సవరించిన రేటు ప్రకారం దేవుడి పాట వెయ్యి రూపాయలు. వెయ్యి రూపాయలు"

"ఐదు వేలు" అందో కొత్త గొంతు.

"భాస్కరావధాన్లు గారి మేనల్లుడు సుబ్బావధాన్లగారి పాట ఐదువేల రూపాయలు. ఐదువేల రూపాయలు. ఒకటోసారి..." ఆ మాట పూర్తికాకుండానే మాజీ కరణం సత్తిరాజు కొడుకు సోమరాజు తీవ్రంగా గర్వంగా "ఏడు వేలు" అన్నాడు.

"మాజీ కరణం గారి కొడుకు సోమరాజుగారి పాట ఏడు వేల రూపాయలు. ఏడువేల రూపాయలు. ఒకటోసారి... రెండోసారి... కొట్టేస్తున్నా! ఏడువేల రూపాయలు" అన్నాడు.

మునిసిపల్ ఆఫీసు గుమాస్తా వెంకటప్పయ్య జోగులయ్య దగ్గరకొచ్చి "నిన్ను ఛైర్మన్‌గారు లోనికి రమ్మంటున్నారు" అని చెవిలో ఊది పోయాడు.

వస్తానన్నట్లు తల ఊపి "అయ్యా! నన్ను ఛైర్మన్‌గారు రమ్మంటున్నారు. కాబట్టి ఎల్తున్నాను. ఈ పాట మాజీ కరణంగారి కొడుకు సోమరాజు గారి మీద ఏడువేల రూపాయల మీద నడుస్తోంది" అంటూ వెళ్ళిపోయాడు.

ఆదరాబాదరా వచ్చిన జోగులయ్యను చూసి ఛైర్మన్ "జోగులయ్యా! ఆ మేష్టర్ పోస్టు పాతికవేలు తక్కువైతే మాత్రం అమ్మకు" అంటూ హుకుం జారీ చేశాడు.

"అది కాదు బాబయ్యా! మరీ అంత రేటెక్కువైతే గొడవొచ్చేత్తదండీ!! తవురి అపోజిషనోళ్ళు ఇదంతా బైటికి లాగి టాంటాం జేత్తారండి. కాబట్టి తవురు మరీ కరాకండీగా రేటు పెడితే సానా సిక్కులొచ్చి పడతాయండి" అన్నాడు జోగులయ్య.

"సరే! అఘోరించు, కనీసం ఇరవైకి

తగ్గనివ్వకు. పోయేముందీ సొమ్మైనా దక్కుతుంది. అట్టే పాట పెరగలేదనుకో ఏదో వంకబెట్టి ఆ పోస్టు ఆపేద్దాం! మిగిలినవి కానివ్వచ్చు" అన్నాడు చుట్ట వెలిగిస్తూ.

పరుగు పరుగున పాట నడుస్తున్న చోటికి తిరిగొచ్చాడు జోగులయ్య. అందరూ అతగాడితో

"తొందరగా తెమల్చవయ్యా! పన్నెండు దాటుతోంది ఆకలేస్తోంది" అంటూ తమ కంగారును బైట పెట్టారు.

"నాకూ ఆకలేస్తోంది. పోస్టు కొనుక్కున్నోళ్ళు ఓ వంద నోటు పడేస్తే మీ పేరు జెప్పుకుని ఇందుభోజనం తినాలనుంది" అన్నాడు బుగ్గమీసాలు దువ్వుకుంటూ.

గొంతు సవరించుకుని "సత్తిరాజు గారి కొడుకు సోవరాజుగారి పాట ఏడు వేల రూపాయలు. ఏడు వేల రూపాయలు..."

ఆ మాట పూర్తి కాకుండానే మరో వ్యక్తి "పన్నెండు వేలు" అంటూ ఉరిమాడు.

"తమరి పేరు" అన్నాడు జోగులయ్య బుర్ర గోక్కుంటూ.

"జీవరత్నం"

"జీవరత్నం గారి పాట పన్నెండు వేల రూపాయలు. పన్నెండు వేల రూపాయలు. ఒకటోసారి, రెండోసారి. కొట్టేస్తున్నా..." అన్నాడు.

"పదహారు వేలు" అన్నదో ఎత్తైన విగ్రహం.

"ఆ పెద్దాయనగారి పాట పదహారు వేలు..."

"నా పేరు పెద్దాయన కాదు. మురళీధరం" అంటూ చికాకు పడ్డాడావ్యక్తి.

"మురళీధరం గారి పాట పదహారు వేల రూపాయలు. ఒకటోసారి, రెండోసారి..."

"పందొమ్మిది వేలు" అన్నాడొక నవాబ్ గారి అబ్బాయి. ప్రక్కనున్న వాళ్ళు వీడేం తెలుగు పాఠం చెబుతాడ్రా బాబూ అంటూ అందరూ చెవులు కొరుక్కున్నారు.

"మీ పేరు బాబూ!" అంటూ జోగులయ్య వినయంగా అడిగాడు.

"ఇక్బాల్ అహ్మద్‌ఖాన్" ఆ పేరు నోరు తిరక్క "సాయిబుగారి పాట పందొమ్మిది వేల రూపాయలు. పందొమ్మిదివేల రూపాయలు. ఒకటోసారి.."

"ఇంక వదిలేద్దాంరా! పెద్ద పెద్దవాళ్ళే పెద్దరేటు పెట్టేసి పోస్టులు కొనేసుకుంటుంటే మన బోటోళ్ళకి ఉద్యోగాలెలా వస్తాయి" అంటూ ఒక్కొక్కరూ జారుకుంటున్నారు.

ఈ లోగా ఒక వ్యక్తి వచ్చి "ఇరవై" అనేశాడు.

"వీరబ్రహ్మాచార్యులు గారి పాట ఇరవై వేలు" అనడం కొట్టేయడం చిటికెలో జరిగింది.

***

అప్పటి దాకా ఆదమరిచి పగటి నిద్రపోతూ కలగంటున్న సీతారామారావుని అతని తండ్రి దర్జీ చంద్రయ్య తట్టిలేపుతూ "ఒరేయ్! సీతారావుడూ!! ఎందుకీ పగటి నిద్ర. అయినా ఎన్నాళ్ళిలా నిద్ర పోతూ గడుపుతావు చెప్పు? ఉద్యోగం కోసం దేవులాడి అలసిపోయే కంటే మన దర్జీ పని నేర్చుకుంటే హాయిగా గడుస్తుంది. బాధంతా దిగమింగి అసలు నువ్వు చదవలేదని అనుకో! ఈ



సీతారామారావు ఇంటికొచ్చేటప్పటికి ఒక కవర్ పడి వుంది. తీరా చించి చదివితే అది మంత్రిగారి ప్రయివేటు సెక్రటరీ వ్రాసింది.

"ఇంకో రెండేళ్ళలో నీకు ఉద్యోగం ఇప్పించగలనని గట్టిగా హామీ ఇస్తున్నాను. ప్రస్తుతం నీవు నిరుద్యోగంతో బాధపడకుండా ఉండటానికి మా బావమరిది ద్రాక్షతోటలో కాపలాకి నమ్మకమైన నీలాంటి మనిషి కావాలి. నీపై నాకా నమ్మకమేర్పడింది. వస్తానంటే వెంటనే బయల్దేరి రావలసింది. వచ్చేటప్పుడు ఖర్చులు కూడా నీవే భరించాల్సివుంటుంది"

అది లేఖలో గల సారాంశం.

పని ఇట్టే వస్తుంది" అన్నాడు.

ఇంతవరకూ జరిగిన వేలంపాటలో మునిసిపల్ ఉద్యోగాలు అమ్మటం మాట అంతా తాను కన్న కలేనా అనుకుని తెల్లగా నిట్టూర్చాడు. అనుమానం తీరక "నాన్నా! మునిసిపల్ స్కూళ్ళలో టీచర్ పోస్టులు, గుమాస్తాలు, అటెండర్ల పోస్టులూ ఇంటర్వ్యూలు అయిపోయాయి కదూ!" అడిగాడు.

"అదేవిట్రా! చదవేస్తే వున్నమతి పోయిందని ఇంటర్వ్యూల్ని పోస్ట్‌పోన్ చేశారని నువ్వే చెప్పావుగా నిన్న. ఇలా పోస్ట్‌పోన్ చెయ్యడం ఇది మూడోసారి అని కూడా అన్నట్టు గుర్తు" అంటూ వెళ్ళి తన కుట్టు పనిలో నిమగ్నమైపోయాడు చంద్రయ్య.

***

మరణశయ్య మీద భీష్మాచార్యుడిలా పరుండి గెడ్డం పెరిగి వళ్ళంతా ట్రైన్ యాక్సిడెంటులో హూనమై ఆస్పత్రి పాలయ్యాడు సీతారామారావు. అంతేనా! తలకు గాయమై ఎడమ కంటి చూపు పోయింది. ఉద్యోగం కోసం విజయవాడ ఇంటర్వ్యూ కెళ్ళి తిరిగొస్తుండగా అనుకోని పరిస్థితులలో ట్రైన్ యాక్సిడెంటు జరిగింది. తనలాంటి ఎందరో అభాగ్యులు ఆ రైలు యాక్సిడెంటు పుణ్యమా అని గాయపడి అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ రోజు అందర్నీ పరామర్శించడానికి ఆరోగ్య మంత్రి గారొస్తున్నట్లు ఆస్పత్రికి కమ్యూనికేషన్ వచ్చింది. డాక్టర్లూ, కాంపౌండర్లూ, నర్సులూ మిగిలిన ఆసుపత్రి సిబ్బంది... వారు వీరనకుండా అంతా ఎక్కడ ఏం కొంప మునిగితే ఎవరి ఉద్యోగాలు పోతాయోనని హైరానా పడుతూ కలదిరి గేస్తున్నారు. బ్లాక్‌మార్కెట్‌కి అందించిన మందుల్ని తిరిగి త్వరగా తెప్పించేస్తున్నారు యుద్ధ ప్రాతిపదికన.

ఎలాగైతే మధ్యాన్నం పన్నెండున్నరగంటలకి మంత్రి పుంగవులు దిగారు. గాయపడిన వాళ్లందర్నీ పరామర్శిస్తూ బోలెడంత సింపతీ వొలకబోస్తూ ప్రతీ బెడ్ దగ్గరికీ వచ్చి పరిశీలిస్తున్నారు. ఆయనకి తోకల్లా కలెక్టరు, మండలాధ్యక్షులు, జిల్లా ప్రజాపరిషత్ అధ్యక్షులు ఒక్కరేంటి వీరు వారునకుండా ఫాలో అవుతూ శ్రద్ధ కనబరుస్తున్నారు. సీతారామారావు బెడ్ దగ్గరకు రాగానే ఆయన రెండు చేతులూ పట్టుకుని నీళ్ళు నిండిన కళ్ళతో

"సార్! సార్!! నేను బాగావున్నప్పుడు ఉద్యోగం రాలేదు. ఇప్పుడ ఒక కన్ను పోగొట్టుకుని అవిటి వాణ్ణయ్యాను. కనీసం వికలాంగుల కోటాలోనైనా నాకొక ఉద్యోగం ఇప్పించి పుణ్యం కట్టుకోండి" అని అడిగాడు.

మంత్రి సాలోచనగా "నీ వయస్సెంత?" అని అడిగి తన సెక్రటరీని దగ్గరకు రమ్మని పిలిచాడు. సీతారామారావు "ముప్ఫై రెండు సార్!" అని జవాబిచ్చాడు. చంద్రయ్య కూడా కలుగజేసుకుని కొడుకు తాలూకు చదువూ గట్రా చెప్పటమేకాకుండా తన ఆర్థిక స్థితిగతులు వెళ్ళగక్కాడు. అంతా విని మంత్రిగారు సెక్రటరీతో సీతారామారావు ఎడ్రసు, క్వాలిఫికేషన్స్ నోట్ చేసుకొమ్మని ముందుకు సాగిపోయాడు. వారం పదిరోజుల కల్లా అందరికీ కొద్ది ధనసహాయం కూడా అందజేసి ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ చేశారు.

సీతారామారావు ఇంటికొచ్చేటప్పటికి ఒక కవర్ పడి వుంది. తీరా చించి చదివితే అది మంత్రిగారి ప్రయివేటు సెక్రటరీ వ్రాసింది.

"ఇంకో రెండేళ్ళలో నీకు ఉద్యోగం ఇప్పించగలనని గట్టిగా హామీ ఇస్తున్నాను. ప్రస్తుతం నీవు నిరుద్యోగంతో బాధపడకుండా ఉండటానికి మా బావమరిది ద్రాక్షతోటలో కాపలాకి నమ్మకమైన నీలాంటి మనిషి కావాలి. నీపై నాకా నమ్మకమేర్పడింది. వస్తానంటే వెంటనే బయల్దేరి రావలసింది. వచ్చేటప్పుడు ఖర్చులు కూడా నీవే భరించాల్సివుంటుంది"

అది లేఖలో గల సారాంశం.

"దేమిట్! చదువుకున్న తనకు జనాలు, మీడియా ముందు తన స్వార్థానికి ఉద్యోగమిప్పిస్తానని చెప్పిన మంత్రి... ఇప్పుడు నా కన్నీళ్ళు తుడవటానికి తోట కాపలాకి రమ్మంటాడా!" అని ఆ కవర్ని అందులో ఉత్తరాన్ని ముక్కలు, ముక్కలుగా చించి పారేశాడు. ఇది పద్ధతి కాదని గ్రహించి ఆ మర్నాటి నుండే తండ్రి దగ్గర కుట్టు పని బాగా నేర్చుకోవడం మొదలెట్టాడు సీతారామారావు.

రానురాను అందులో మెలుకువలు, కొత్త పద్ధతులు గ్రహించాడు. తండ్రి వృద్ధుడు కావడంతో అతనికి చేతి పని అప్పగించాడు. బ్యాంక్ లోన్ పెట్టి మూడు మిషన్లు కొని ఆర్థికంగా కాస్త పుంజుకున్నాడు. దానితోపాటు లోను తీరిపోవడమే కాకుండా ఒక రెడీమేడ్ దుకాణానికి ఓనర్‌గా కూడా మారిపోయాడు.

లోగిలి లోగిలిలో...

బి.ఎన్. రెడ్డి

డా॥ జె.పి.వైద్య

అప్పటి వరకు సాంఘిక పాత్రల్లో, రొమాంటిక్ వేషాల్లో పేరు తెచ్చుకున్న నాగయ్యను 'పోతన' పాత్ర కోసం ఎన్నుకొని - వాస్తవికత కోసం 'గుండు' చేసుకోవాలని పురమాయించారు రెడ్డిగారు.

-'అయ్యో ! నిగనిగలాడే నీలికేశాలండీ బాబూ! ఎలా?' అని బెంగతో ఒకవైపు... భక్తి రసపాత్రలో నాగయ్యను ప్రేక్షకులు స్వీకరిస్తారా అని అనుమానంతో మరోవైపు... సందేహాలు మొదలయ్యాయి. కె.వి. రెడ్డి, లింగ మూర్తి లాంటి వాళ్ళు బలవంతంగా ఒప్పించారు.


కె.వి. రెడ్డి

చిగురాకులలో చిలకమ్మా...

"నేను పట్టిన కుందేలుకు మూడే కాళ్ళు సుమా!" అని భీష్మించుకొని కూర్చునే మహామొండివాళ్ళు సమాజంలో పుట్టెడుమంది వున్నారు.

"ఆc అసలది కుందేలే కాదు...." అని ఇంకా దులిపి పారేసే 'మొండి రత్నాలూ' ఉన్నారు.

'ఆడది అసూయనూ, మగవాడు మొండితనాన్నీ పట్టుకొని జన్మిస్తారు' అని పెద్దవాళ్ళు వూరికే చెప్పలేదు. అయితే ప్రతి చోటా, ప్రతి విషయంలోనూ కాస్తంత కుడి ఎడమలూ, కూడికా తీసివేతలూ ఉంటాయి.

'కుక్క తోcక దెచ్చి గొట్టంబుc జేర్చిన
క్రోవి చెంత నుండు కొంత తడవు
ఎంత జెప్పc జెడుగు పంతంబు మానునా?

అని వేమన గారూ చెప్పి వెళ్ళారు.

నిద్రపోయిన వాళ్లను లేపొచ్చు కాని నిద్రపోతున్నట్టు నటించే వాళ్లను లేపలేము. యుక్తికి యుక్తి చెప్పగలమేమో కాని... మొండివాడానికి జవాబు చెప్పడం కష్టం.

కాని, వీటన్నింటికీ అతీతంగా 'మరో జాతి వాళ్ళూ' ఉంటారు. నిష్కల్మషం, నిష్కపటం, సాదాసీదా, అరమరికలు లేని తత్వం ఉన్న ముక్కుసూటి మనుష్యులు.

"ఆc... ఇగ గంతగనం సాదాసీదా ఉంటే బతికినట్టే! అరేc! భాయిసాబ్...! గిదంతా మాయల మారి ఫకీర్లున్న కాలికాలం భై! నీ మట్టి బుర్రల కెన్నిసార్లు చెప్పినా ఎక్కదేంది? మేం దునియా దారీ చెప్తున్నాం... నీ దిమాగ్ కెక్కుతలేదు.... పద్దవ్....! మూతి మీద పద్దవ్... మూతి పండ్లూ... రెండు మూడు బొక్కలు విరగ్గొట్టుకుంటవ్ జాగ్రత్త!" అని ప్రేమ పూరితమైన వార్నింగ్‌లిచ్చేవాళ్ళు ఆ రోజుల్లోనూ ఉండేవారు. ఈ రోజుల్లోనూ ఉన్నారు.

సినీ దునియాలో నీలి నీడల వార్తలు చాలా స్పీడుగా వ్యాపిస్తాయి. ఇప్పుడిప్పుడు కంప్యూటర్లో, సెల్‌ఫోన్లలో వైరస్ అంటూ గగ్గోలు పడ్తున్నాం మనం. కాని మానవ రూపంలో తిరిగే 'ఆకాశ రామన్న'ల్లాంటి వైరస్‌లు చాలా డేంజరస్. 'బాంబే టాకీసోళ్లు గిట్ల అనుకుంటున్రు'.... 'మినర్వా బందైతున్నది... తెలుసావురా'.... 'ఆర్కే ఖతమ్! మూతపడ్డదనుకో!!'..... 'వాహినీల కెల్లి కేవీ వెళ్ళిపోతాండు'....

'ఇలా ఉత్తరాది, దక్షిణాది అని సందేహము వలదు. ఏ దిశ నుండైనా వార్తలు రాయబడును. సత్వర గతిన ప్రసారంబు చేయను గలరు' అనే ప్రవృత్తి గలవాళ్ళు సృష్టించిందే 'ఎల్లో జర్నలిజం'.....! ఇంకా హాయిగా బ్రతికే వుంది. కె.వి రెడ్డి గారు ఎంతో నిక్కచ్చిగా, బరువు బాధ్యతలను గుర్తెరిగి మసలుకునే తెలుగు సినీ దర్శకుడు. ఆయన పేరుకు ఎంతో విలువ ఆ రోజుల్లో.... వాహినీ స్టూడియోలో వారు చేసిన వన్నీ అపురూపమైన చిత్రాలే. ఉండుండి ఒక వార్త దావాలనంగా వ్యాపించింది.

-"కె.వి. రెడ్డి గారు వాహినీ సంస్థను వదిలేస్తున్నారనీ"

చిత్రసీమ ఒక్కసారిగా షాక్ తిన్నట్టు లేచి కూర్చున్నది. ఎవరి నోట విన్నా ఆ మాటే. ఇక్కడ మనం ఒక్కసారి 'వాహిని' సంస్థ గురించి తలచుకోవాలి.

1939లో బి.యన్.రెడ్డి ప్రధాన సూత్రధారిగా స్థాపించబడ్డ సంస్థ 'వాహిని'. చిత్ర రంగంలో కళాత్మక శిల్పాలకూ, నూతన విలువలకూ, సామాజిక అంశాలకూ పెట్టనికోటగా నిలబెట్టిన వాహిని వారు రసికులకు అందించిన చిత్రాలు తెలుగు చిత్ర పరిశ్రమలోని మేలిమి రత్నాలు... అరుదైన ఆణిముత్యాలు.

'వందేమాతరం' - సుమంగళి' - 'దేవత' - 'స్వర్గసీమ' - 'మల్లీశ్వరి' లాంటి చిత్ర నిర్మాణంతో వాహినీ సంస్థ తన ప్రత్యేకతను చాటుకున్నది. హెచ్.ఎం. రెడ్డి గారి గురించి మనం ఇదివరకు చెప్పుకున్నాం. ఆయన సంస్థ 'రోహిణి', భాగస్వాములు బి.యన్.రెడ్డి, మూలా నారాయణస్వామి. కె.వి.రెడ్డి క్యాషియర్.

'ప్రేక్షకుడిలో భావ ప్రేరణ కలిగించేది నిజమైన కళాత్మకత నిండిన క్లాస్ చిత్రం' అనే భావాలు వాళ్ళవి.

1938లో 'గృహలక్ష్మి' చిత్రనిర్మాణం సాగుతోంది. కళాత్మక హృదయం ఉన్న హెచ్.ఎం. రెడ్డి ఆ సినిమాకు సహ నిర్మాత, దర్శకుడు కూడానూ. హీరో రామానుజాచారి, వేశ్యగా నటిస్తున్న కాంచనమాల మధ్య చిత్రీకరిస్తున్న కొన్ని అశ్లీలమైన షాట్స్ గురించి జరిగిన చిన్న గొడవ 'రభస'గా మారింది. పూర్తిగా వ్యాపారదృష్టితో తీస్తున్న 'చిత్రీకరణ'తో రాజీపడని రెడ్డిగారు బయటపడి కొంతమంది మిత్రులతో జతకూడి 'వాహినీ సంస్థ'ను స్థాపించారు.

మూలస్తంభాలుగా తోడు నీడగా చేరిన వారూ చిన్న వాళ్ళు కారు. అందరూ నియమనిబద్ధతలను పాటించే హేమాహేమీలు. సినీ సృష్టిలో ఆనాడు అలాంటి వాళ్ళుండటం ఆశ్చర్యం. నేడైతే ప్రపంచంలోని 'కొత్త వింత'.

మూలా నారాయణ స్వామి, నాగిరెడ్డి, కె.వి. రెడ్డి, బ్రిజ్ మోహన్ దాస్, సముద్రాల, రామ్‌నాథ్, ఎ.కె. శేఖర్, నాగయ్య మద్రాసు సముద్రం ఒడ్డున 'ఇలియట్స్ బీచ్'లో అలల సాక్షిగా ప్రమాణం చేశారు.

-"అందరం కలిసి కట్టుగా ఉండి చక్కటి చిత్రాలనే నిర్మిద్దాం" అని. ఒక్కొక్కరు ఒకొక్క బాధ్యత తల మీద పెట్టుకున్నారు స్వేచ్ఛగా, ఆనందంగా బాధ్యతాయుతంగానూ. సంగీతం, నటనకు చిత్తూరు వి. నాగయ్య జిమ్మేదారీ. రచన సముద్రాల పని. ఛాయాగ్రహణం రామ్‌నాథ్ గారి డ్యూటీ. ఎ.కె. శేఖర్ సౌండ్ ఇంజనీరింగ్, ఆర్ట్ డైరెక్షన్ బాధ్యతలను తీసుకున్నారు. కె.వి. రెడ్డి ప్రొడక్షన్ మేనేజర్. యూనిట్ అంతా కలిసి మెలసి,

ఎలాంటి అరమరికలు లేకుండా మసలుకునేవారు. కలిసే సినిమాలు... కలిసే షికార్లు!

ప్రొడక్షన్ మేనేజర్ గారు కార్లూ... జోర్లూ... అంటూ ఎలాంటి పోకడలూ, భేషజాలు లేకుండా పొద్దున్నే సైకిల్ సవారీ చేస్తూ, పెడల్ తొక్కుతూ హీరో నాగయ్య ఇంటికి చేరుకునేవారు. 75 రూపాయల నెల జీతం.

హీరో, ప్రొడక్షన్ మేనేజరూ 'డబుల్ సవారీల సైకిల్ యాత్ర' ఈనాడు తలచుకుంటే ఆశ్చర్యంగానూ, అపురూపంగానూ లేదూ?

అయితే ఆ రోజుల్లో హీరో హీరోయిన్లు కూడా సైకిల్ సవారీలు తెరమీద చేశారు. మనం సైకిల్ లేకున్నా చూసి, మురిసిపోయి, 'ఛ...! ఎలాగైనా సరే సైకిల్ సంపాదించి ఏ రెండు జడల సీతనో ఎక్కించుకొని, ఝుమ్మని, రయ్‌మని సాగిపోవాలి' అని మనసులో కలలు కూడా కని పారేశాం!

'దొంగరాముడు'లో ఏఎన్నార్, రేలంగి, సూర్యకాంతం

వాహిని పిక్చర్ తొలిచిత్రం 'వందేమాతరం'. హీరోగా నాగయ్య, హీరోయిన్‌గా 'కాంచనమాల' చేశారు. అది రాజకీయ చిత్రం. ముందు జాగ్రత్తగా బ్రాకెట్‌లో 'మంగళసూత్రం' అని మరో పేరునూ జత పరిచారు. నిరుద్యోగ, వరకట్న సమస్యలతో తీసిన చిత్రం అది. నేటికి ఆరుదశబ్దాలు దాటినా ఆ 'విషయం' ఇంకా మన సమాజంలో అంతే వేడిగా, వాడిగా కోరలు చాచి, నిప్పురవ్వలు కక్కుతూ సజీవంగా ఉంది. అది మన దురదృష్టం, దౌర్భాగ్యం, కాక ఇంకేమిటి?

'వాహిని'లో ప్రొడక్షన్ మేనేజర్‌గా పని చేసిన కె.వి. రెడ్డిని 1942లో దర్శకుడిగా చూశారు మన కన్నా పాత తరం రసిక సినిమా ప్రియులు. 'భక్తపోతన' ఆ సినిమా.

ఇక్కడో గమ్మత్తు చెప్పాలి పాఠక మిత్రులకు.

అప్పటి వరకు సాంఘిక పాత్రల్లో, రొమాంటిక్ వేషాల్లో పేరు తెచ్చుకున్న నాగయ్యను 'పోతన' పాత్ర కోసం ఎన్నుకొని - వాస్తవికత కోసం 'గుండు' చేసుకోవాలని పురమాయించారు రెడ్డిగారు.

-'అయ్యో ! నిగనిగలాడే నీలికేశాలండీ బాబూ! ఎలా?' అని బెంగతో ఒకవైపు... భక్తి రసపాత్రలో నాగయ్యను ప్రేక్షకులు స్వీకరిస్తారా అని అనుమానంతో మరోవైపు... సందేహాలు మొదలయ్యాయి.

కె.వి. రెడ్డి, లింగ మూర్తి లాంటి వాళ్ళు బలవంతంగా ఒప్పించారు.

సాంఘిక చిత్రాల రొమాంటిక్ హీరో నున్నగా గుండు గీయించుకొని, నిగనిగలాడుతూ, భక్తి రసగీతాలు పాడటం ప్రారంభించాడు. సరిగ్గా అదే సమయంలో ప్రపంచ పరిస్థితులు మరోలా ఉన్నాయి.

'భక్తి రసమూ - భక్త పోతన' గురించి ఏ మాత్రం అవగాహన లేని జాపాన్ వారి విమానాలు, నిర్దాక్షిణ్యంగా మద్రాసు ప్రాంతంలో బాంబులు పడవేసి గాల్లోకి మాయమైపోయాయి. ఏంచేయాలో పాలుపోని 'భక్తులు' ఆఘమేఘాల మీద మద్రాసు నగరాన్ని ఖాళీ చేసి చెదిరిపోయారు. కె.వి. రెడ్డి, బి.ఎన్. రెడ్డి తాడిపత్రికి తరలివెళ్ళారు. రామ్‌నాథ్, శేఖర్ మద్రాసు వాళ్ళు.... 'వాహినీ' వదలి 'జెమిని' పంచన చేరారు. యుద్ధం తాలూకు మబ్బులు మటుమాయం అయ్యాక అందరూ మళ్ళీ మద్రాస్ చేరుకొని 'భక్తపోతన'ను పూర్తి చేశారు. ఆ రోజుల్లో ఖర్చు లక్ష రూపాయలు దాటింది. సాంఘికాల రొమాంటిక్ హీరో 'నాగయ్య' భక్త పోతనగా సంచలనం సృష్టించాడు. పత్రికలు పని కట్టుకొని 'ఓహో! ఆహో' అంటూ పొగిడాయి. ఆకాశానికి ఎత్తేశాయి.

నాగయ్యను కారణజన్ముడని గౌరవంగా ఆదరించడం ఆ రోజు నుండే ప్రారంభమైంది.

నాస్తికుడైన ప్రముఖ తమిళ హాస్య నటుడు ఎస్. ఎస్. కృష్ణన్, శ్రీమతి టి. ఎ. మధురం నాగయ్యగారికి పట్టు బట్టలున్న వెండి పళ్లెం అర్పించి 'నాస్తికుడైన నాకు మీలో దేవుడు కన్పించాడు' అని అభివాదం చేశారట.

'సర్వ మంగళ నామా రామా'-'పావన గుణ రామా హరే' లాంటి పాటలు జనరంజకమై ప్రజల నోట్లో నానాయి.

కొన్ని కారణాల వల్ల కె.వి. రెడ్డి గారు 'వాహిని సంస్థ'ను వదిలేశారు. ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థలన్నీ స్వాగతం పలుకుతూ ఆయన కోసం పోటీ పడ్డాయి. సందిగ్ధావస్థలో ఉన్న ఆయన ఎవరికీ ఏ మాటా ఇవ్వలేదు.

ఆ క్షణంలో మన అందాల ఎవర్‌గ్రీన్ హీరో నాగేశ్వరరావు, మధుసూధనరావు కలసి కె.వి. రెడ్డిని పలకరించారు.

అప్పటికే హీరో నెంబర్ వన్ స్థానంలో ఉన్న 'ఎఎన్నార్'ను డైరెక్ట్ చేయాలన్నది కె.వి. కోరిక. ఆయన దర్శకత్వంలో నటించాలన్నది ఈయన కోరిక.

కె.వి. రెడ్డి లాంటి గొప్ప దర్శకుడు వారి సంస్థ తొలి చిత్రానికి దర్శకత్వం వహిస్తే 'ఇమేజ్' ఎంతగానో ఇనుమడిస్తుందని అందరికీ బాగా తెలిసిన విషయం.

వాహిని నుంచి బయట కొచ్చి చేసే తొలి చిత్రం గురించి 'ప్రతిష్టాత్మకంగా' భావించారు.

- "ప్రస్తుతం నేను మరో చిత్రం చేస్తున్నాను. నేను ఒకసారి ఒకే చిత్రాన్ని చేస్తానన్నది మీకు తెలుసుగా! మీరు ఆ చిత్ర నిర్మాణం పూర్తయ్యే వరకు నిరీక్షించగలరా?' అని కె.వి. అడిగారు. వీరు ఒపిగ్గా నిరీక్షించారు.

పాండీ బజారులోని 'ఎల్లో జర్నలిజం' గగ్గోలు పెట్టింది. "కె.వి. బయటికొచ్చి పెద్ద సంస్థలకు కాకుండా ఊరు పేరు లేని చిన్న సంస్థలకు చేయడమేమిటి? మతి చెడిపోయింది. వాళ్ళకూ వీళ్ళకూ! పైగా సాంఘికమట! జానపదమో? పౌరాణికమో తీస్తే కాసులైనా మిగిలేవి! అంతే అయిపోయింది. ఆయన పని... వీళ్ళ పని.... గోవిందా" అని పేజీలకు పేజీలు గీకేశాయి పత్రికలు. కె.వి. కూడా నింపాదిగా, చక్కటి ప్రాక్టికల్ సలహాలిచ్చారు. 'షూటింగ్‌కు ఇంకా టైముంది. బిల్డింగ్ ఖర్చులు ఎందుకూ? ఒక్క డ్రైవర్, ఒక్క బాయ్, ఒక్క అకౌంటెంట్ చాల్లెండి. తర్వాత చూద్దాం' అన్నారు.

పత్రికలు మళ్ళీ ఎగిరెగిరి రాశాయి.... 'హుం! మళ్ళీ ఏముంటుందని చూద్దానికి! రాయడానికీ' అని. అన్నపూర్ణ సంస్థ వారి తొలి చిత్రం 'దొంగ రాముడు' అఖిలాంధ్ర ప్రేక్షకుల మనస్సులను దోచుకొని, చరిత్ర సృష్టించింది. 'చిగురాకులలో చిలకమ్మా' నేటికీ టాప్ హిట్ పాట...! నమ్మకం లేదా! మెల్లగా కూని రాగం తీసి చూడండి...! ఎంత మంది మీ వైపు దొంగ చూపులు చూస్తారో!!

❋

దీనిపై మీ స్పందనను రచయితకు తెలియచేయవచ్చు.
ఫోన్: 08732223622

జన చైతన్యం కోసమే...



కళ్లకు గంతలు కట్టుకుని బైక్ నడపడం...నోట్లోంచి శివలింగాన్ని తీయడం...వీపుకు కొక్కేలు గుచ్చుకుని వాహనాన్ని లాగడం... కాగుతున్న నూనె లోంచి వేడి వేడి మిర్చి బజ్జీలను తీయడం...మంటలను మింగడం... కత్తిని కడుపులోకి దూర్చడం... మండే కాగడాను ఒంటిపై రాసుకోవడం... ఏంటీ...ఇవన్నీ మనుషులు చేసే పనులేనా అనుకుంటున్నారా? సర్కస్ ఫీట్లను తలపించే ఇలాంటి ఎన్నో విన్యాసాలను అవలీలగా ప్రదర్శించి చూపరులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తున్నారు ఒక వ్యక్తి. ఆయనే జనవిజ్ఞాన వేదిక (జెవివి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. రమేష్. అబ్బురపరిచే ఇలాంటి విన్యాసాల ప్రదర్శన ఒక్క హైదరాబాద్‌లోనే కాదు... రాష్ట్రంలోని 23 జిల్లాల్లోనూ ఇచ్చి పట్టణ, గ్రామీణ జనాన్ని చైతన్యవంతం చేస్తున్నారు.

మాయలు, మంత్రాలు, బాణామతి, చేతబడి, మూఢనమ్మకాల వంటివి ఏమీ లేవని, ప్రజలు సైన్స్‌ను శాస్త్రీయంగా అవగాహన చేసుకోకపోవడం వల్లే అలా అపోహ పడుతున్నారని ఆయన అంటారు. మ్యాజిక్కుల గుట్టును సైన్స్‌తో రట్టు చేయవచ్చంటారు రమేష్. మ్యాజిక్కులు, మూఢ నమ్మకాలపై సమాజాన్ని చైతన్యవంతం చేసే క్రమంలో జెవివి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 13 నుండి మార్చి 6 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 23 జిల్లాల్లో సైన్స్‌జాతాలను నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా దశల వారీగా తాను స్వయంగా కళ్లకు గంతలు కట్టుకుని 3,637 కిలోమీటర్లు మోటార్ సైకిల్ నడిపించి తన వంతుగా సమాజ చైతన్యంలో భాగం పంచుకున్నానన్నారు. ప్రజాశక్తి ప్రతినిధి నరేష్‌గౌడ్‌కు మరిన్ని ఆసక్తికరమైన విషయాలను తెలిపారు. అవేంటో తెలుసుకుందామా....

సమాజ ప్రగతిలో సైన్స్‌కు ఉన్న ప్రాముఖ్యత గురించి వివరిస్తారా..?

ఏ దేశం అయినా ప్రగతి సాధించాలంటే విద్య, వైద్య వ్యవస్థను కాపాడాలి. ఇందుకోసం విద్యకు 7 శాతం నిధులు కేటాయించడమే కాకుండా ప్రభుత్వ ఆస్పత్రులను కాపాడాలి. ఐక్య రాజ్యసమితి ఈ ఏడాదిని ధరిత్రీ సంవత్సరంగా ప్రకటించింది. "మన భూమి, మన నేల, మన భవితను కాపాడుకుందాం...అదే భూతల స్వర్గం" అన్న నినాదంతో ముందుకు వెళ్తున్నాం. మంత్రాలు, మాయలు లేవు. ఉన్నదంతా సైన్స్ మాత్రమే అని నిరూపించేందుకే ఈ ప్రదర్శనలు, విన్యాసాలు చేస్తున్నాం.

కళ్లకు గంతలు కట్టుకుని మోటార్ సైకిల్‌ను నడిపించడంలో ఉన్న ట్రిక్ ఏమిటో తెలియజేస్తారా?

కళ్లకు గట్టిగా గంతలు కట్టుకున్నా ముక్కు కింది భాగం నుండి చూస్తే ఎంతో కొంత చిన్నగా కనిపిస్తుంది. ఆ యాంగిల్ చాలు బైక్ నడిపించడానికి. ఇంకా కొంచెం ఎక్కువ దూరం వరకు దారి కనిపించాలనుకుంటే బైక్‌పై కూర్చోకుండా నిలుచుని నడిపిస్తే సరిపోతుంది. నీడ ఉన్నట్లు గమనిస్తే వేగాన్ని కాస్త తగ్గించాలి. మొత్తం మీద వారం రోజులు గనుక ప్రాక్టీస్ చేస్తే ఎవరైనా సరే ఇట్టే నేర్చుకోవచ్చు.

కాగుతున్న నూనెలోంచి వేడి వేడి బజ్జీలను ఎలా తీయగలిగారో చెబుతారా?

ఇందులో ఇంద్రజాలం ఏదీ లేదు. ముందుగా చల్లటి నూనెలో చేయి తడిపి ఆ తర్వాత కాగుతున్న నూనెలోంచి మిర్చి బజ్జీలను తీసేయవచ్చు. చేతికి చల్లని నూనె ఉండడం వల్ల అది వేడి అయ్యేం దుకు కనీసం ఒక నిమిషం సమయం తీసుకుంటుంది. ఈలోగా మిర్చిని తీసి బయటవేయవచ్చు. మేం చేసిన పని అదే.

బాబాలు, సత్యసాయి లాంటి వారు నోటిలో నుండి శివలింగాన్ని తీసి మహిమలు అంటున్నారు. దీనిని మీరూ చేసి చూపించారు. ఇదెలా సాధ్యమైంది?

కుడిచేతి బొటన వేలిలో శివలింగాన్ని దాచి పెట్టుకోవాలి. ఎడమ చేతిలో ఏమీ లేదంటూ గాలిలోకి అలా చేతులు ఊపుతూ కుడి చేతిలోని లింగాన్ని అమాంతం నోట్లోకి తీసుకుంటాం. ఆ తర్వాత కడుపులోంచి లింగాన్ని తీస్తున్న అనుభూతిని కల్పించేందుకు ఆయాస పడుతూ నోట్లోంచి బయటికి తీస్తాం.



వీపుకు కొక్కేలు బిగించుకుని వ్యాన్‌ను లాగడం వెనుక ఉన్న లాజిక్కు ఏంటో వివరిస్తారా?

చర్మానికి సాగే లక్షణం ఉంది. ఆ బలం చర్మానికి ఉండబట్టే 60 నుండి 70 కిలోల బరువును పైకి ఎత్తవచ్చు. అలాగే వాహనాన్ని లాగవచ్చు. కొక్కేలు తగిలించుకునేటప్పుడు కాసింత నొప్పి పుట్టినా లక్ష్య సాధనలో ఆ మాత్రం ఇబ్బంది పెద్దగా బాధ అనిపించదు. పైగా వాహనాన్ని పల్లపు దిశగా పెట్టి లాగుతాం. చూసే వారు ఎవరైనా అసలు ఈ విషయాన్నే గమనించరు.

మండే కాగడాను ఒంటిపై రాసుకోవడం, మంటలను మింగడం వంటి విన్యాసాల్లో ఉన్న మతలబు ఏంటో చెబుతారా?

మంట వేడికి మనిషి చర్మం కాలిపోవాలంటే కొన్ని క్షణాలైనా ఆ మంట ఒకే చోట ఉండాలి. కానీ అలా కాకుండా విన్యాసాల్లో భాగంగా మంటను పైకి కిందకి శరీరం (చర్మం)పై అలా వెంటవెంటనే రాయడం వల్ల మంట వేడి ఎక్కడా తాకదు. ఈ లాజిక్‌ను వీక్షకులు గుర్తించరు. కర్పూరాన్ని చేతిపై వేసుకుని రెండు చేతుల్లోకి మార్చి ఆ వెంటనే నోట్లో వేసుకుని నోరు మూసుకుంటే అది వెంటనే ఆరిపోతుంది. ఆక్సిజన్ లభించకపోతే మంట ఆరిపోతుందన్న సైన్స్ ధర్మం ఇందులో దాగుంది. ❋

హోలీ అంటే సంబరం. పిల్లలకే కాదు పెద్దలకూ. ఆ రోజున పెద్దలు కూడా పిల్లలవుతారనేది వేరే విషయం. రంగు నీళ్లు, రంగులు, కోడిగుడ్లు చేతిలో పట్టుకొని ఒకటే ఉరుకులు ... పరుగులు. వాటిని స్నేహితులు, సన్నిహితులు, బంధువుల మీద చల్లేదాకా మనసు నిలవదు. ఎవరైనా హోలీ చల్లించుకోకుండా దాక్కుంటే... వారిని కనిపెట్టి రంగులు చల్లడంలో వుండే ఆనందం అంతా ఇంతా కాదు. షాపుల్లో అన్ని రంగులు కనిపిస్తుంటాయి. ఎరుపు, పసుపు, నారింజ, ఆకుపచ్చ, బులుగు... రంగునీళ్లన్నీ కలిసి రోడ్డుమీద అలా పారతా వుంటే చూడ్డానికి రెండు కళ్లూ చాలవు. ఈ ఆనందమంతా హోలీ పండుగకు ఒక వైపు మాత్రమే.

రంగు పడుద్ది

కె.చరిత

మరి రెండో వైపు ఏంటంటారా! హోలీ చల్లుకునే సంతోషంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మర్చిపోతాం. అదే మనకు తిప్పలు తెచ్చిపెడుతుంది. ముఖ్యంగా కళ్ల విషయంలో ఎంతో జాగ్రత్తగా మసలుకోవాలి. రంగుల్లోని ప్రమాదకరమైన రసాయనాలవల్ల ఆసుపత్రుల పాలైన వారిని, కంటిచూపు కోల్పోయిన వారిని కూడా చూస్తుంటాం. మరి ఆ జాగ్రత్తలేంటో ఓసారి గుర్తుచేసుకుందామా!!

హోలీ...జాగ్రత్తలు

- హోలీ రోజు బయటికెళ్లాల్సి వస్తే టోపీ, కళ్లజోడు తప్పనిసరిగా ఉపయోగించాలి.
- ప్రకృతి సహజమైన ఉత్పత్తులతో మనం తయారుచేసుకున్న రంగులైతే పరవాలేదు. అవి కాకపోతే కాస్త ఖరీదైనవైనా మంచి రంగులు కొనుక్కోవాలి.
- ఎక్కువగా ఎరుపు, గులాబి రంగులు వాడండి. వాటిని కడిగితే త్వరగా పోతాయి. ఆకుపచ్చ, పసుపు, నారింజ రంగులను వదిలించుకోవడం మహా కష్టం.
- గోళ్లకు నెయిల్‌పాలిష్ వేసుకుంటే హోలీ అక్కడ అతకదు.
- తలకు నూనె పెట్టుకుంటే మంచిది. ఎందుకంటే అప్పుడు రంగులు తలకు అంటుకోవు.
- ఎవరైనా రంగులు చల్లడానికి వస్తే మొహాన్ని వారికి అందకుండా చూసుకోవాలి. అది సాధ్యంకాకపోతే... కనీసం నోరు, కళ్లు గట్టిగా మూసుకోవాలి. అప్పుడు రంగుల్లో వున్న రసాయన పదార్థాలు కళ్లల్లోకి, నోట్లోకి పోవు.
- హోలీ రోజు కాస్త పాత బట్టలు వేసుకుంటే వాటిని రంగులు పోయే వరకు శుభ్రంగా ఉతకాల్సిన పనిలేదు. వెంటనే కూడా ఉతకనవసరం వుండదు.
- కోడిగుడ్లు నెత్తిమీద రుద్దితే మంచిదే. హెయిర్ కండిషనర్‌గా ఉపయోగపడుతుంది. కానీ తారు వంటివి పూస్తుంటారు. ఇక వాటిని వదిలించుకోవడం ఎంత కష్టమో తెలియనిదేముంది!
- చర్మం దురదపెడుతున్నట్టు అనిపిస్తే... దద్దుర్లు వస్తే... వెంటనే చర్మవ్యాధి నిపుణులను కలవాల్సిందే.
- హోలీ చల్లుకునేటప్పుడు తడిగా వున్న మెట్లమీద పరుగుతీయొద్దు. కాళ్లు జారి పడితే గాయాలవుతాయి.
- పూర్తిగా రంగులు చల్లుకోవడం అయిన వెంటనే శుభ్రంగా తల స్నానం చేయాలి. అంతేగాని మధ్యమధ్యలో స్నానం చేయడం, మొహాన్ని మాటిమాటికీ కడగడం చర్మానికి అంత మంచిదికాదు. అదేపనిగా షాంపూలు, సబ్బులు ఉపయోగించడం వల్ల తల వెంట్రుకలు కూడా ఊడిపోయే అవకాశం వుంది.

ఈ చిన్ని చిన్ని జాగ్రత్తలు పాటిస్తే...హోలీ పండుగను సంతోషంగా, ఆనందంగా జరుపుకోవచ్చు. ఏమాత్రం అజాగ్రత్తగా వున్నా... రంగు పడుద్ది. ❋

రెడీమేడ్ గైడ్



'రంగుల కల, దండోరా, ఎర్రసైన్యం, అడవిలో అన్న, అరణ్యం, ఒసేయ్ రాములమ్మ, తెలుగోడు, స్వర్ణక్క చీకటి సూర్యులు, అమ్ములు, చీమల దండు, కూలన్న..' లాంటి సినిమాల్లోని పాటల సంకలనం ఇది.

గూడ అంజయ్య సినీ ప్రవేశం సుప్రసిద్ధ సినిమా దర్శకులు బి. నర్సింగరావు గారి 'రంగుల కల' చిత్రంలో 'భద్రం కొడుకో... కొడుకో కొమరన్న... జర పైలం కొడుకో... నా కొడుకో కొమరన్న...' అనే గీతంతో ప్రారంభమైంది. కొన్ని సినిమాల్లో వేషం కూడా వేశారాయన.

'ఊరు మనదిరా... ఈ వాడ మనదిరా' తెలుగు సాహిత్యంలో ప్రకంపనలు రేకెత్తించిన విప్లవ ఉద్యమ గీతం.

'ఒసేయ్... రాములమ్మ' లోని 'లచ్చులో... లచ్చన్న'....

వందేమాతరం శ్రీనివాస్, ఆర్. నారాయణ మూర్తి, జె.వి. రాఘవులు, షేక్ ఇమామ్ సంగీత దర్శకత్వంలో ప్రస్తుతంగా విప్లవాన్ని నినదించిన గీతాలు ప్రముఖంగా ఇష్టంగా వినే రసికులకు ఈ 67 పేజీల చిన్న పుస్తకం ఒక రెడీమేడ్ గైడ్ లాంటిది.

గూడ అంజయ్య సినిమా పాటలు, పేజీలు: 67, వెల: 30/-, ప్రతులకు: గూడ అంజయ్య- హైదరాబాద్ అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.

డా॥ జె.పి. వైద్య

మంచి విమర్శలు

ఈ మధ్య విశాలాంధ్ర వారు టి.ఎల్ కాంతారావు గారి పలు విమర్శక వ్యాసాలను పుస్తకంగా తీసుకొచ్చారు. కాంతారావుగారిని ఎరగని తెలుగు సాహితీ కారులుండరనడం అతిశయోక్తి కాదనే అనుకుంటున్నాను. తెలుగు సాహిత్యంపై ఆయన పలు సందర్భాల్లో చేసిన కామెంట్స్ నాటి సాహిత్యకారుల్ని ఆలోచింపజేశాయి. పలు పుస్తకాలపై, కవుల సాహిత్య వ్యక్తీకరణలపై ఆయన సూచనలు, సలహాలు నిర్మాణాత్మకంగా, ముక్కుసూటిగా ఉంటాయి. బుచ్చిబాబు కథలను గురించి చెప్తూ "పగిలిన అగ్ని పర్వతంలా చలం రచన సాగిస్తే, శరత్కాలపు మేఘంలా, వాసంత సమీరంలా బుచ్చిబాబు రచనలు చేశాడు" అనడం వెనుక ఇద్దరి రచనలకు సంబంధించిన కంపారిటివ్ స్టడీ ఉంది. ఏంటీ శ్రీశ్రీ కవిత్వానికి కృష్ణశాస్త్రి కవిత్వానికి తేడా అనుకుంటే చలం 'యోగ్యతాపత్రం'లో చెప్పిన ఆ ఒక్కమాట చాలనడం సాహిత్య సమాజంలో ఉంది. కాంతారావుగారి కృషి, పట్టుదల, ముక్కుసూటిగా తన అభిప్రాయాల్ని వ్యక్తం చేయడం వంటి సుగుణాలు తెలుగు సాహిత్యంలోని అనేక ప్రక్రియలు పాజిటివ్ సెన్స్‌లో వికసించడానికి ఉత్ప్రేరకాలని చెప్పొచ్చు. పలానా కవి ఇట్లా ఉండాలి, పలానా వ్యక్తి అట్లా ఉండాలి అని చెప్పకుండా 'ఇది నా తీర్మానం కాదు, నా అభిప్రాయం (కొడాలి వెంకట సుబ్బారావు హంపీ క్షేత్రం పై రాసిన వ్యాసంపై)' అని చెప్పడంలోనే ఆయన విమర్శావిధానం ఏమిటో అర్థమవుతుంది. దిగంబర కవుల మీద, వారి కవిత్వం మీద నాడు రావాల్సినంత, జరగాల్సినంత చర్చ జరిగింది. అందులో భాగంగానే కాంతారావు గారి వ్యాసం కూడా వచ్చింది. ఈ వ్యాసాన్ని చదివినప్పుడు ఈయన వాళ్లని సమర్థించినట్లుగానో, వ్యతిరేకించినట్లుగానో అన్పించదు. వాళ్ళ కవిత్వాన్ని నాటి పరిస్థితుల నగ్నత్వాన్ని, ఆ కాలానికి వాళ్ళు ఇచ్చిన ట్రీట్‌మెంట్ అవసరాన్ని విశ్లేషించినట్లుగా కన్పిస్తుంది. ఇది మంచి విమర్శ లక్షణం. విమర్శకుడు ఖడ్గాల్ని చేతిలో పట్టుకున్నట్టుగా కాకుండా కవిత్వాన్ని విశ్లేషించాలనే ఆలోచనగలవాడుగా ఈ పుస్తకం (కలాలు-సంకలనాలు, విభిన్న పుస్తకాల విశ్లేషణలు)లోని విశ్లేషణలు చదువుతుంటే అర్థమవుతుంది. ప్రస్తుతం తెలుగు సాహిత్యాన్ని సృష్టిస్తున్న వారికీ, ఆదరిస్తున్నవారికీ కాంతారావు గారిని మళ్ళీ ఒకసారి గుర్తు చేసిన విశాలాంధ్ర పబ్లిషింగ్ వారు అత్యంత అభినందనీయులు. అయితే ఈ వ్యాసాల చివరలో అవి రాసిన (లేదా), ప్రచురించిన తేదీలను ఇస్తే మరింత ఉపయోగకరంగా ఉండేది. ఈ మాటను పరిశోధకులను దృష్టిలో ఉంచుకొని అనడమేనని చెప్తూ నేటి కాలానికీ, విమర్శకులకు అవసరమైన విమర్శకుణ్ణి, విభిన్న విశ్లేషణల్ని పాఠకులు తప్పక ఆదరిస్తారని చెప్పడం ఎక్కువేం కాదనిపిస్తుంది.

టి.ఎల్ కాంతారావు,
కలాలు- సంకలనాలు
విభిన్న పుస్తకాలపై విశ్లేషణలు, వెల: 75,
ప్రతులకు :
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

- సైదులు ఐనాల

50 కరంట్

ఇంటర్నేషనల్ ఇష్యూస్ ఫర్ సివిల్ సర్వీసెస్ & ఎపిపిఎస్‌సి ఎగ్జామ్స్,
నాగేశ్వరరావు గూడవల్లి,
వెల:125/-,
పేజీలు:211 ,
ప్రతులకు: కెకెఎం పబ్లికేషన్స్, విజయవాడ.

మనిషి

జననానికి ముందు-మరణం తర్వాత
పెరుగు నాసరయ్య
వెల:35/-,
పేజీలు:104
ప్రతులకు:
విశాలాంధ్ర, మిత్ర,
నవ్య సాహిత్య పరిషత్, కరీంనగర్.

'సి'

నేర్చుకుందాం రండి
ఆర్. రవి,
ఎ. రవికిరణ్,
వెల:40/-,
పేజీలు: 134,
వెల:125/-,
పేజీలు:211,
ప్రతులకు:
శ్రీ బాలాజీ పబ్లికేషన్స్,
33-3-31, రామానాయుడు వీధి,
విజయవాడ.

మీరూ దస్తావేజులు రాయొచ్చు

అంకెం మురళీ కృష్ణ
అంకెం సునీతారాణి
వెల:25/-,
పేజీలు:80
ప్రతులకు:
శ్రీ బాలాజీ
పబ్లికేషన్స్
33-3-31, రామానాయుడు వీధి, విజయవాడ.





మినీ గన్

అరచేతిలో కనిపిస్తున్న బుల్లి గన్ పిల్లలు ఆడుకునేది కాదు. నిజమైనదే. మిషన్‌గన్‌లా బుల్లెట్లను కురిపిస్తుంది. ఈ తూటాలు గంటకు 434 కిమీ వేగంతో దూసుకెళతాయి. ఈ మినీగన్‌ను స్విట్జర్లాండ్‌కు చెందిన ఒక కంపెనీ మూడేళ్ల క్రితమే మార్కెట్‌లోకి విడుదల చేసింది. అయినా ఇప్పటికి కేవలం 300 గన్‌లనే అమ్మింది. ఎందుకంటే ఏడాదికి 25 బంగారు గన్‌లూ, 100 స్టీల్ గన్‌లూ తయారు చేస్తుంది. వెరైటీ గన్‌లను సేకరించే అలవాటు వున్నవారే దీనిని ఎక్కువగా కొనుక్కుంటున్నారు. అదీ ఆరు నెలల ముందుగా బుక్ చేసుకోవాలి. ఇక ధర అంటారా మన కరెన్సీలో అయితే దగ్గర దగ్గర రెండున్నర లకారాలే.

చిట్టి టీ పాట్

"వావ్! చూపుడు వేలిమీద ఎంచక్కా ఇమిడిన టీపాట్ ఎంత బావుందో! పిల్లలు ముద్దుముద్దుగా ఆడుకునే వంట సామాన్లలో కూడా ఇంత చిన్న టీపాట్ వుండదే. ఎక్కడిదీ!" అనుకుంటున్నారా? మాక్కూడా సేమ్ ఫీలింగ్ అండీ. అసలు విషయానికి వస్తే ఈ టీపాట్‌ని చైనాకు చెందిన 'ఉ రూయ్' అనే వ్యక్తి సృష్టించాడు. నచ్చేసిందా! ప్రపంచంలోకెల్లా అతిచిన్న టీపాట్ ఇదే. దీని బరువు సింపుల్‌గా 1.4 గ్రాములే.

బుల్లి న్యూస్ పేపర్

ఇది అట్లాంటి ఇట్లాంటి న్యూస్ పేపర్ కాదండోయ్! దీన్ని చూసిన వారెవరైనా అవాక్కైపోవాల్సిందే. ఎవరైనా సరే దీన్ని చదవాలంటే మాత్రం భూతద్దాలను ఉపయోగించాల్సిందే. అదే దీని స్పెషల్. ఇంతకీ ఇది ఎంత చిన్నగా వుంటుందనుకుంటున్నారు? జస్ట్ 32×22 మిల్లీమీటర్లు. ఇంకా క్లియర్‌గా చెప్పాలంటే...పేపర్ క్లిప్ కంటే కొంచెం చిన్నగా వుంటుంది. అన్నట్టు ఇది లండన్‌కి చెందిన పిల్లల పత్రిక. పేరు 'ఫస్ట్ న్యూస్'. ప్రపంచంలోనే అత్యంత చిన్న పత్రికగా ఈ మధ్యే గిన్నిస్ బుక్ రికార్డుల్లోకి కూడా ఎక్కిందీ బుజ్జిది.

OK

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలంస్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్: కలం స్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : దేశరాజు కృష్ణజ
చదువు: 6వ తరగతి
వయసు: 11 సం॥
స్కూలు : శ్రీసీతారామ ఎయిడెడ్ హైస్కూల్
లక్ష్యం: పైలట్ కావడం
హాబీలు : పుస్తకాలు చదవడం, టీవీ చూడడం, బొమ్మలు వేయడం
చిరునామా : దేశరాజు కృష్ణజ, డాటరాఫ్: కృష్ణమూర్తి, సత్యనారాయణపురం, చర్ల, ఖమ్మం.

పేరు : షేక్ జమాల్ వలి
చదువు: 4వ తరగతి
వయసు: 9 సం॥
స్కూలు : వరసిద్ధి వినాయక
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు : టెన్నిస్ ఆట ఆడటం, కారు డ్రైవింగ్ చేయడం
చిరునామా : షేక్ జమాల్ వలి, సన్నాఫ్: వలి, గిద్దలూరు, కడప.

పేరు : కె. బాలరాజు
చదువు: 10వ తరగతి
వయసు: 15 సం॥
స్కూలు : జడ్.పి.హెచ్.ఎస్., వెన్నచెర్ల,
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు : పుస్తకాలు చదవడం, డాన్స్ చేయడం, డ్రాయింగ్
చిరునామా : కె.బాలరాజు, సన్నాఫ్: సత్యం, ఇం.నెం. 11-9-110, వెన్నచర్ల, మహబూబ్‌నగర్.

పేరు : కరెడ్ల ప్రవీణ్
చదువు: 6 వ తరగతి
వయసు: 10 సం॥
స్కూలు : శ్రీవాణి విద్యాలయం, యుపిఎస్, నంగునూరు.
లక్ష్యం: ఇంజనీర్ కావడం
హాబీలు: చదవడం, టీవీ చూడడం, క్రికెట్ ఆడడం
చిరునామా : కె. ప్రవీణ్, సన్నాఫ్: కె. లక్ష్మారెడ్డి, గణపూర్, నంగునూర్, మెదక్,

పేరు : పుల్లురి ఉదయ్ కుమార్
చదువు: 4వ తరగతి
వయసు: 9 సం॥
స్కూలు : వివేకానంద పాఠశాల, తాడ్వాయి
లక్ష్యం: ఎస్.ఐ. కావడం
హాబీలు : పుస్తకాలు చదవడం, టీవీ చూడడం పేపర్ చదవడం
చిరునామా : పి. ఉదయకుమార్, సన్నాఫ్: రాజలింగం, తాడ్వాయి, నిజామాబాద్.

పేరు : కోటకొండ మోహన్
చదువు: 7వ తరగతి
వయసు: 13 సం॥
స్కూలు : బి.వి. సుబ్బయ్య హైస్కూల్, పేర్నమిట్ట
లక్ష్యం: డాక్టర్ కావడం, మధర్ థెరిసాలా సేవ చేయడం
హాబీలు : ఆటలు ఆడడం, కథల పుస్తకాలు చదవడం, టీవీ చూడడం, పాటలు పాడడం
చిరునామా : కె. మోహన్, సన్నాఫ్: మాల్యాద్రి, ఒంగోలు, ప్రకాశం జిల్లా.